



RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక



GK MEDIA
Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
• SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది •



ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 353 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 01 - అక్టోబర్ - 2026 | వెల రూ. 5 /-




చదవండి.. చదివించండి..

నేటి శుభోదయ

ప్రతిక్షణం.. ప్రజల కోసం...

నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక

వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి

మా వెబ్‌సైట్ www.netishubhodaya.com

వాట్సాప్ 9696571571

మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!



RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక



GK MEDIA Voice of People

CHANNEL NO. 433

SSLC CABLE NETWORK

SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది



ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 353 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 01 - అక్టోబర్ - 2026 | వెల రూ. 5 /-


# ‘గజ్వేల్ గడీ’ తర్వాత.. ఇప్పుడు ‘సిరిసిల్ల గడీ’ని కూలుస్తాం..

## - రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు
- కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ
- బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు
- దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు

**నేటి శుభోదయ, సిరిసిల్ల :** సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. ‘పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ’ అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని .....

2





## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్..

### వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం

2

## ‘సర్’పై వివాదం వేళ..

### ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం



- కొత్త ఓటర్లకు తల్లిదండ్రుల వివరాలు అక్కర్లేదు
- తాతలు, నానమ్మల వివరాలూ అవసరం లేదు
- సర్ పూర్తయిన చోట అదనపు డిక్లరేషన్ అవసరం లేదన్న ఈసీ
- సర్ కొనసాగుతున్న చోట పాత నిబంధనే
- ఫారం-6 ద్వారా కొనసాగనున్న నిరంతర నమోదు

2



## కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు ఖరారు..

- పట్టభద్రుల బరిలో కాంగ్రెస్ అభ్యర్థులు వీరే: ఖర్గే ఆమోద ముద్ర
- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్ బరిలో సర్వోత్తమ్ రెడ్డి
- రేవంత్ సర్కార్ పనితీరుకు అసలైన పరీక్ష : పట్టభద్రుల పోరులో త్రిముఖ పోటీ?
- ఉద్యోగ నియామకాలు, నిరుద్యోగ సమస్యలే అజెండాగా ఎమ్మెల్సీ సమరం

2

### భారత్‌లోని ప్రతి ముస్లిం పూర్వీకులు రాముడు, కృష్ణుడే..

## రాందేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు

- భారత్‌లోని ముస్లింలంతా మతం మారినవారేనన్న బాబా రాందేవ్
- రాముడు, కృష్ణుడు వారి పూర్వీకులేనని సంచలన వ్యాఖ్యలు
- ఒవైసీ వ్యాఖ్యలపై స్పందిస్తూ రాందేవ్ ఈ వ్యాఖ్యలు చేశారు
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కూడా ఖండించిన యోగా గురు



2

## రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

### - సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

- రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం
- తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న
- రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ

2



## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు - కేటీఆర్



- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

**నేటి శుభోదయ, మునుగోడు :** పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

## గిల్ డబుల్ ధమాకా.. రోహిత్ హిట్ షో..

### 400+ టార్గెట్‌ను ఊదిపారేసిన భారత్




- వెస్టిండీస్‌పై భారత్ 8 వికెట్లతో ఘన విజయం
- గిల్ 223 పరుగులతో నాటౌట్
- 117 బంతుల్లో గిల్ డబుల్ సెంచరీ
- రోహిత్ 75 బంతుల్లో 101 పరుగులు
- 2-0తో భారత్ సిరీస్ కైవసం

వివరాలు 2 లో..

# మోదీ-ట్రంప్ ఫోన్ కాల్..

## వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

**మొదటిపేజీ తరువాయి..** ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్–అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా–యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్–అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

## : సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

**మొదటిపేజీ తరువాయి..** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7–8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

# భారత్‌లోని ప్రతి ముస్లిం పూర్వీకులు రాముడు, కృష్ణుడే..

## - రాందేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలోని ముస్లింలందరూ మతం మారినవారేనని, శ్రీరాముడు, శ్రీకృష్ణులను తమ పూర్వీకులుగా గుర్తించాలని వ్యాఖ్యానించారు. బుధవారం మధురలో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఏ రాజకీయ పార్టీ కూడా ముస్లింలకు స్వతంత్ర రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆశించడం లేదని, వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయంటూ మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై రాందేవ్ స్పందించారు. "మన ప్రాచీన రుషులు, శ్రీరామకృష్ణులు తమ పూర్వీకులేనని ముస్లిం సోదరులందరూ గుర్తించాలి. తమ మూలాలతో అనుసంధానమైతే వారు ఎన్నటికీ బలహీనంగా భావించరు" అని రాందేవ్ పేర్కొన్నారు. హిందూ–ముస్లింలు ఐక్యంగా ఉంటేనే దేశం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇదే తరహా వ్యాఖ్యలను గతంలో బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ, ఉత్తరప్రదేశ్ మంత్రి ఆనంద్ స్వరూప్ శుక్లా కూడా చేసిన సందర్భాలు ఉన్నాయి.

**రేవంత్ వ్యాఖ్యలపైనా స్పందన**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'శివుడు పేదల దేవుడు, రాముడు ధనికుల దేవుడు' అనే వ్యాఖ్యలపై కూడా రాందేవ్ స్పందించారు. సనాతన ధర్మంలో కులం, వర్గం పేరుతో కొందరు విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు అందరూ ఒక్కటేనని, దేవుడి పేరుతో గందరగోళం సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు.

# 'గజ్వేల్ గడీ' తర్వాత.. ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..

## - రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు.

ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్–2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు ఖరారు..

**మొదటిపేజీ తరువాయి..**

తెలంగాణలో త్వరలో జరగనున్న శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలకు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఖరారు అయ్యారు. వారి పేర్లను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. ఈ మేరకు అభ్యర్థుల తుది జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. రంగారెడ్డి–హైదరాబాద్–మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి సామా రామ్మోహన్ రెడ్డి బరిలోకి దిగుతున్నారు. నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ ఇద్దరు నాయకులకు క్షేత్రస్థాయిలో ఉన్న పట్టు, విద్యార్థి దశ నుంచి పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను పరిగణనలోకి తీసుకుని వారి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల నేపథ్యాన్ని పరిశీలించి వారిని ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వ పనితీరు, ప్రజల్లో ఉన్న విశ్వసనీయతకు ఒక రకంగా ఇది రేవంత్ సర్కార్ కు పరీక్షగా నిలవనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర పీసీసీ ముఖ్య నేతల అభిప్రాయాల ఆధారంగానే ఏఐసీసీ తుది నిర్ణయం తీసుకుంది. రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. మహబూబ్ నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ స్థానంలో పట్టణ ఓటర్లు, ఐటీ నిపుణులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రభావం అధికంగా ఉంటుంది. ఇక్కడ యువతలో మంచి గుర్తింపు ఉన్న సామ రామ్మోహన్ రెడ్డిని నిలబెట్టడం ద్వారా సానుకూల ఫలితాలు సాధించవచ్చని కాంగ్రెస్ గట్టి నమ్మకంతో ఉంది. ఉద్యమాలకు కేరాఫ్ అయిన నల్గొండ–ఖమ్మం–వరంగల్ నియోజకవర్గంలో విద్యావంతుల ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఇక్కడ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అభ్యర్థిత్వం పార్టీ గెలుపుకు దోహదపడుతుందని స్థానిక నేతలు అంచనా వేస్తున్నారు. ఈ రెండు స్థానాల్లోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ కూడా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతుండటంతో పోటీ త్రిముఖంగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ, నిరుద్యోగ సమస్యలు, గ్రూప్స్ పరీక్షల నిర్వహణ, విద్యా రంగానికి కేటాయింపులు వంటి అంశాలు ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలు కానున్నాయి.

# 'సర్'పై వివాదం వేళ.. ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..**

కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక మార్పు చేసింది. 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' (సర్) పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం–6లో మార్పులు చేసింది. ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం–6 సరిపోయేది. అయితే 'సర్' ప్రక్రియ సమయంలో ఫారం–6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు. 'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం–6తో పాటు 'సర్'కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి. ఫారం–6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం–6, 'సర్'కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది. తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం–6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

# గిల్ డబుల్ ధమాకా.. రోహిత్ హిట్ షో..

## 400+ టార్గెట్‌ను ఊదిపారేసిన భారత్

**మొదటిపేజీ తరువాయి..** వెస్టిండీస్ 405 పరుగులు చేసింది.. భారత్ ముందు 406 పరుగుల టార్గెట్ పెట్టింది.. కానీ టీమిండియా బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని చూసి బెదరలేదు. బంతి బంతికీ ఆధిపత్యం చూపించారు. ఒకవైపు రోహిత్ శర్మ సెంచరీతో పునాది వేస్తే.. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీతో విధ్వంసం సృష్టించాడు. కోహ్లీ 29 పరుగులకే వెనుదిరిగినా.. రుతురాజ్ గైక్వాడ్ అండగా నిలవడంతో గిల్ చివరి వరకు నాటౌట్‌గా నిలిచి భారత్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. 43.3 ఓవర్లలో 406/2తో లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది.

**405కు సమాధానం 406.. అదీ 43.3 ఓవర్లలో!**

టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు వెస్టిండీస్ బ్యాటర్లు గట్టి సవాల్ విసిరారు. జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలతో చెలరేగడంతో విండీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 405 పరుగులు చేసింది. ఇది వన్డేల్లో వెస్టిండీస్‌కు అత్యధిక స్కోర్. భారత్‌పై కూడా వారి అత్యధిక వన్డే స్కోర్ ఇదే. కానీ 406 పరుగుల లక్ష్యం భారత్‌కు ఏమాత్రం భారంగా అనిపించలేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ మొదటి నుంచే విండీస్ బౌలర్లపై ఎదురుదాడి చేశారు. ఓపెనింగ్ జోడీ ఏకంగా 255 పరుగులు జోడించి భారీ ఛేదనకు బలమైన పునాది వేసింది.

**హిట్‌మ్యాన్ సెంచరీ.. గిల్‌కు డబుల్ ట్రీట్!**

రోహిత్ శర్మ 75 బంతుల్లో 101 పరుగులు చేశాడు. 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అదరగొట్టిన రోహిత్.. వన్డేల్లో తన 35వ సెంచరీని నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లోనే 12 వేల వన్డే పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన మూడో భారత బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ సరసన నిలిచాడు.

రోహిత్ ఔటైన తర్వాత గిల్ తన జోరును మరింత పెంచాడు. 133 బంతుల్లో 223 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 26 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయి. 117 బంతుల్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేసిన గిల్.. వన్డే చరిత్రలో అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.

**కోహ్లీ నిరాశ.. గైక్వాడ్ అండ**

రోహిత్ ఔటైన తర్వాత విరాట్ కోహ్లీ క్రీజులోకి వచ్చాడు. అయితే తొలి వన్డేలో సెంచరీతో అదరగొట్టిన కోహ్లీ ఈసారి 29 పరుగులకే వెనుదిరిగాడు. దీంతో భారత్‌కు చిన్న ఎదురుదెబ్బ తగిలినప్పటికీ గిల్‌పై దాని ప్రభావం పడలేదు.

కోహ్లీ తర్వాత వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ బాధ్యతగా ఆడాడు. గిల్‌తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు. గైక్వాడ్ 37 బంతుల్లో 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు గిల్ చివరి వరకు అజేయంగా నిలిచి 223 పరుగులతో భారత చరిత్రాత్మక విజయానికి హీరోగా మారాడు.

# పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.కేసు వివరాలు.... ప్రేమ పేరుతో మైనర్ యువతిని వేధించిన ఖమ్మం నగరానికి చెందిన చెకూరి శ్రీకాంత్, 20 సం, పై ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 82/2023, ఎస్ సి నెంబర్. 33/2023లో ఐపిసి సెక్షన్లు 354(ఏ), 354(డి), పోక్సో చట్టం –2012 సెక్షన్ 8 కింద నమోదైన కేసును విచారించిన మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఖమ్మం న్యాయమూర్తి డా. పుల్లభట్ల పొగడ కృష్ణ అర్జున్ నిందితుడిని దోషిగా నిర్ధారించి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు.కేసు దర్యాప్తును ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. శ్రీకాంత్ నిర్వహించారు. ప్రభుత్వ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదనలు వినిపించారు.బాధితురాలికి న్యాయం జరిగేలా భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమారాణి సహకరించారు.కేసు కోర్టు లైజన్ బాధ్యతలను కె. శ్రీకాంత్, ఎస్ఐ నిర్వహించగా, హోంగార్డ్ ఆఫీసర్ ఎం. అయూబ్ (హోంగార్డ్) సహకరించారు.కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్, కోర్టు లైజన్ విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అధికారులను, సిబ్బందిని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# మహిళా సంఘాలతో సమావేశాల్లో పాల్గొనని అధికారులు

**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మధిర మున్సిపాలిటీ పరిధిలో మెప్మా లో 162 సంఘాలు ఉండగా 22 వార్డులు ఉన్నాయి. 28 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. వీటన్నిటిని కలిపి ఒక టీఎంసీ గా ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల్లో ఎస్ ఎస్ జి ఎస్ ఎల్ ఎఫ్ టి ఎల్ ఎఫ్ సంఘాలు ఉంటాయి. ఎస్ ఎస్ జి సంఘాలకు మొదటి లీడర్ రెండవ లీడర్ ఉంటారు. ఇలాంటి సంఘాలను 15 సంఘాలను కలిపి ఎస్‌ఎల్‌ఎఫ్ గా ఏర్పాటు చేస్తారు. ఈ ఎస్ ఎల్ ఎఫ్ ను చూడటం కోసం ఒక ఆర్పిని ఏర్పాటు చేసి ఆ ఆర్పి ద్వారా ఎస్ ఎస్ జి సంఘాల్లో రుణాలు ఇప్పించడం జరుగుతుంది. దీనికి సంబంధించి పుస్తకాలు, చెక్కుబుక్కులు వీటి నిర్వహణ ఆర్పీలు చూసుకోవాలి. వీటికి సంబంధించిన పుస్తకాలు మొత్తం ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు దగ్గర ఉండాలి, కానీ ఇవన్నీ ఆర్పీలు దగ్గర ఉంచుకొని ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గర సంతకాలు మాత్రమే ఆర్పీలు తీసుకుంటున్నారు. ఇలా రుణాలు ఇప్పించే సమయంలో తమకు నగదు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం ఎస్‌ఎల్‌ఎఫ్ సంఘాల సమావేశాలకు హాజరై ఆర్పీలు రుణాలు ఇప్పించే సమయంలో ఎటువంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రచారం చేయాలి, కానీ మధిర మున్సిపాలిటీ పరిధిలో సంఘాల సమావేశాలకు అధికారుల హాజరు కాకుండానే ఆర్పీలతోనే నడిపిస్తున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు తమకు పూర్తిస్థాయిలో సమాచారం అందటం లేదని ఆర్పీలకు అవసరమైన సమాచారం మాత్రమే అందిస్తున్నారని, మిగిలిన సమాచారం అందించడం లేదని పేర్కొంటున్నారు. ఆర్పీలు రుణాలు ఇప్పించే సమయంలో నగదు అడుగుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆర్పీలు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి మధిర మెప్మాలో రుణాలు తీసుకునే సమయంలో ఆర్పీలు తీసుకుంటున్న నగదు పై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి

- **అభ్యర్థిత్వం ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం**
- **కృతజ్ఞతలు తెలిపిన డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ నుండి అధికారిక ప్రకటన వెలువడింది.అభ్యర్థిత్వం ప్రకటించినందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సహచర మంత్రివర్గ సభ్యులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుల ప్రతినిధిగా, పార్టీకి నిబద్ధత కలిగిన నేతగా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆయన గెలుపు కోసం ఖమ్మం జిల్లాలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటర్ల నమోదులోనే గెలుపు పునాది ఉందని, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు,జిల్లా నాయకులు,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు, బ్లాక్ మండల, పట్టణ, కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రస్తుత ,మాజీ ప్రజా ప్రతినిధులు,అనుబంధ సంఘాల నాయకులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కోరారు.సర్వోత్తం రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శ్రేణులు అందరు ఎన్నికల ప్రచారంలోకి దిగాలని సూచించారు.

# తెలంగాణ ఖమ్మం అర్బన్ సౌత్ మండల్ 70 వ ఎస్ జిఎఫ్ స్కూల్ గేమ్స్ రేజోనెన్స్ శ్రీనివాస నగర్ విద్యార్థుల ఘన విజయం



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం మండల స్థాయిలో 29-09-2026న సర్దార్ పటేల్ స్టేడియం లో నిర్వహించిన సౌత్ మండల్ 70 వ ఎస్ జిఎఫ్ స్కూల్ గేమ్స్ లోనూ రేజోనెన్స్ విద్యార్థులు ప్రతిభ చూపి మండల స్థాయిలో సెలెక్ట్ అయ్యారు. ఈ పోటిలలో మా విద్యార్థులు అండర్ 17 విభాగంలో పవన్ కుమార్ కబ్బడి, అండర్ 17 విభాగంలో కృష్ణ చైతన్య, , ప్రశాంత్,శ్రావణ్ కుమార్ వాలి బాల్, అండర్ 14 కృష్ణ ప్రసాద్, జ్ఞానేశ్వర్ వాలి బాల్ పోటి లో సెలెక్ట్ అయ్యారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల యాజమాన్యం అయిన డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, నీలిమా మాటాడుతూ ఇలాంటి విజయాలు మరెన్నో సాధించేలా ప్రోత్సహిస్తూ విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు మెరుగు పరుస్తామని తెలియజేస్తూ విద్యార్థులందరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి**
- **డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించాలి**
- **25 నుంచి 60 ఏళ్ల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులను గుర్తించి నమోదు చేయాలి**
- **ఫారం-18ను పట్టభద్రత ధృవీకరణ పత్రంతో సమర్పించి ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి**
- **గతంలో 84 వేల మంది నమోదు కాగా, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను నమోదు చేయడమే లక్ష్యం**
- **పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**
- **వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీపై రాజకీయ పార్టీల \ ప్రతినిధులతో సమావేశమైన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు, జాబీతా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో వరంగల్–ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీ, ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమావేశం నిర్వహించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో 1,75,858 అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు గుర్తించగా, వారిలో 1,69,802 మందికి నోటీసులు అందజేశామని, 1,36,208 మంది ఓటర్ల హియరింగ్ పూర్తి చేశామని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న 5,460 ఫారం–6, 1,172 ఫారం–7 దరఖాస్తులు, 9,087 ఫారం–8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అభ్యంతరాల సమర్పణకు అక్టోబర్ 7 చివరి తేదీ అని, నవంబర్ 5 వరకు నోటీసుల ప్రక్రియ, అభ్యంతరాల పరిష్కారం అనంతరం నవంబర్ 9న తుది ఎస్ఐఆర్ జాబితా ప్రచురించే ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

**ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి**

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతి ఎన్నికల సమయంలో పట్టభద్రులు తప్పనిసరిగా తాజాగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.తేది: 31–10–2023 నాటికి పట్టభద్రులైన అర్హులు, 01–11–2026ను అర్హత తేదీగా తీసుకొని రూపొందించే ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం–18ను పట్టభద్రత ధ్రువీకరణ పత్రంతో సంబంధిత ఈఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**2 లక్షల మంది పట్టభద్రుల నమోదు లక్ష్యం**

గతంలో ఖమ్మం జిల్లాలో సుమారు 84 వేల మంది పట్టభద్రులు మాత్రమే ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు అయ్యారని, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పోస్టర్లు, అవగాహన వీడియోలు రూపొందించి ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు**

జిల్లాలోని ప్రతి డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలలో ప్రత్యేక ప్రచార దినోత్సవం నిర్వహించి కళాశాల నుండి గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారి వివరాలు తీసుకొని, అర్హులైన పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి మండలంలో మొత్తం ఓటర్ల జాబితాను పరిశీలించి, 25 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులైన వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) కూడా చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు.

**ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలి**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఓటు తదితర అంశాలపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలి, ప్రాధాన్యతా ఓటు విధానం ఎలా ఉంటుంది అనే అంశాలపై అవసరమైన అవగాహన వీడియోలను రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 01–11–2026ను అర్హత తేదీగా తీసుకొని ఓటరు జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.ఓటర్ జాబితా నమోదు నోటిఫికేషన్ 28–09–2026న, మొదటి పునః ప్రచురణ 15–10–2026న, రెండో పునఃప్రచురణ 25–10–2026న జరుగుతుందని తెలిపారు.ఫారం–18 దరఖాస్తుల స్వీకరణకు 06–11–2026 చివరి తేదీ అని పేర్కొన్నారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ 20–11–2026 నాటికి పూర్తి చేసి, 25–11–2026న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను 25–11–2026 నుంచి 10–12–2026 వరకు స్వీకరిస్తామని, వాటిని 25–12–2026 లోపు పరిష్కరించి, 30–12–2026న తుది ఓటరు జాబితాను ప్రచురించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్‌డీసీ సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీఆర్ ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సీపీఎం పార్టీ ప్రతినిధులు డి. తిరుపతి రావు, ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధులు అన్నెం గోపాల్ రావు, జి. సూర్యనారాయణ, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న పోరాటాలను తీవ్రతరం చేయండి

- **ఏఐకేఎంఎస్ సంస్థను సంఘటిత పరిచి మరింత విస్తరింప చేయాలి**





**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 4వ జాతీయ మహాసభలు బుధవారం ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. గత జాతీయ మహాసభల నుంచి నేటి వరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన అనుభవాలను వివరిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ వివరమైన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.దానిలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం సాగించిన పోరాటాల్లో ఏఐకేఎంఎస్ చురుకైన పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఢిల్లీ సరిహద్దుల్లో, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో సాగిన రైతాంగ ఉద్యమంలో ఏఐకేఎంఎస్ విస్తృతంగా పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేసిందన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో రైతాంగ ఉద్యమం సాధించిన విజయాన్ని ఆయన ప్రస్తావించారు.ఈ ఉద్యమం ద్వారా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో రైతాంగంతో ఏఐకేఎంఎస్ సంబంధాలు విస్తృతమయ్యాయని, సంస్థకు కొత్త ప్రాంతాల్లో పరిచయాలు ఏర్పడి ఉద్యమ విస్తరణకు మార్గం ఏర్పడిందని తెలిపారు. ఉద్యమ సందర్భంగా ఎదురైన అనుకూల, ప్రతికూల అనుభవాలను సమీక్షించుకొని భవిష్యత్ పోరాటాలకు వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

**భూమి సమస్యపై నిరంతర పోరాటాలు**

దేశవ్యాప్తంగా భూమి సమస్యపై ఏఐకేఎంఎస్ నిర్వహించిన పోరాటాలను నివేదికలో ప్రధానంగా ప్రస్తావించారు. బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో భూమిలేని పేదలు, రైతులు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీల భూమి సమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు.బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటిస్తూ అనేక రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో రైతాంగాన్ని, భూమిపై ఆధారపడిన ప్రజలను సమీకరించి పోరాడినట్లు కొన్ని విజయాలు సాధించినట్లు ఇది కిలో పేర్కొన్నారు. భూస్వాములు భూకబ్జా, ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియాలకు వ్యతిరేకంగా కూడా ఉత్తర ప్రదేశ్ పంజాబ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో పోరాటాలు సాగినట్లు నివేదికలో పేర్కొన్నారు. పంజాబ్ లో దళితులకు భూమి సాధించేందుకు నిర్వహించిన పోరాటాలను, పోలీసుల నిర్బంధాన్ని, వందలకొద్దీ మూడు నెలలు జైల్లో గడిపిన విషయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**ఆదివాసీ ప్రాంతాల్లో కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు**

ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణ, అడవుల ఆక్రమణ, సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐకేఎంఎస్ వివిధ ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసిందని డాక్టర్ ఆశిష్ మిట్టల్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆదివాసీలను విస్తృతంగా సమీకరించి భూమి, అడవి, సహజ వనరుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ ప్రాంతాల్లో స్థానిక సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా దీర్ఘకాలిక ఉద్యమాలను నిర్మించాలని సూచించారు.ఎం ఎస్పి కోసం పోరాటంరైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాల్లో ఏఐకేఎంఎస్ క్రియాశీలంగా పాల్గొన్నదని నివేదికలో పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తికి గిట్టుబాటు ధర, రుణభారం నుంచి విముక్తి, రైతుల జీవన భద్రత వంటి అంశాలను భవిష్యత్ పోరాటాల్లో మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**ఎం జిఎన్ఆర్ఈజిఏ స్థానంలో విబి - జిఆర్ఏఎంజి కు వ్యతిరేకంగా ఉద్యమం**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం జిఎన్ఆర్ఈజిఏ) ను బలహీనపరిచి, దాని స్థానంలో విబి – జిఆర్ఏఎంజి వంటి కొత్త విధానాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐకేఎంఎస్ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలు నిర్మించిందని డాక్టర్ సతీష్ మిట్టల్ తెలిపారు.గ్రామీణ పేదలకు ఉపాధి హామీ, కూలీలకు పని దినాలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.సంస్థాగత బలోపేతమే ముందున్న ప్రధాన కర్తవ్యంగత కాలంలో జరిగిన పోరాటాల విజయాలను సమీక్షించుకోవడంతో పాటు, వాటి నుంచి సంస్థాగత నిర్మాణానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవాలని జాతీయ ప్రధాన కార్యదర్శి సూచించారు.

**సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయండి**

సభ్యత్వాన్ని గణనీయంగా పెంచడం, ప్రతి గ్రామంలో సంఘాన్ని నిర్మించడం, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేయడం, రాష్ట్ర కమిటీలను మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దడం అత్యంత ప్రాధాన్యమైన కర్తవ్యాలని తెలిపారు.రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదల వాస్తవ సమస్యలను గుర్తించి వాటిపై నిరంతర పోరాటాలు నిర్వహించడం ద్వారానే సంఘాన్ని విస్తృత ప్రజా సంస్థగా బలోపేతం చేయగలమని నివేదిక స్పష్టం చేసింది.గత పోరాటాల అనుభవాలను సమీక్షించుకొని, కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో బలమైన సంస్థాగత పునాదులను నిర్మించడమే నాల్గవ జాతీయ మహాసభల ముందున్న ప్రధాన లక్ష్యమని డాక్టర్ ఆశిష్ మిట్టల్ పేర్కొన్నారు.మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ నివేదికపై చర్చిలో పాల్గొని నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా వేములపల్లి వెంకటరామయ్య సుశాంత్ జై చలపతిరావు రవీందర్ సింగ్ తదితరులు వ్యవహరించారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

ఉద్యోగ విరమణ పొందిన వారు
ఎస్ కే సర్దార్,
ఎస్సై త్రీ ఖమ్మం,
డి హైమావతి,
సీపర్ (పోలీస్ హెడ్ క్వాటర్స్ ),
జి సైదులు (హోంగార్డ్ ).

కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్,ఆర్ ఐ లు కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను,జాతీయ ఉపాధ్యక్షులు సిసి 21 ఈ. వెంకటేశ్వర్లు, సంక్షేమ సంఘం సీనియర్ అడ్వైజర్ డి. రమేష్, వి. అప్పారావు, కె.వి.ఆర్ కే రెడ్డి తదితర హోంగార్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# భద్రాద్రి నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న త్రివేణి డైరెక్టర్‌కు సంఘీభావం

- **పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించిన త్రివేణి ఉపాధ్యాయులు, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు**





**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్యక్షేత్రం నుంచి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధి వరకు నిర్వహిస్తున్న 8వ రామన్న, వెంకన్న మహా పాదయాత్రలో పాల్గొంటున్న త్రివేణి పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి కి, పాదయాత్ర బృంద సభ్యులకు ఖమ్మం త్రివేణి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్టూడెంట్ కౌన్సిల్ నాయకులు మాట్లాడుతూ ఎంతో భక్తిశ్రద్ధలతో భద్రాద్రి నుంచి తిరుమల వరకు చేపడుతున్న ఈ మహా పాదయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు డా. వీరేంద్ర చౌదరి కి, పాదయాత్ర బృంద సభ్యులందరికీ ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.డా. వీరేంద్ర చౌదరి నేతృత్వంలో కొనసాగుతున్న 8వ రామన్న, వెంకన్న పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా పూర్తి కావాలని, పాదయాత్ర ద్వారా చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా సంకల్పాలు విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం బ్రాంచ్ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు, హెడ్ బాయ్, వివిధ హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, విద్యార్థులు పాల్గొని పాదయాత్ర బృందానికి “ అల్ ద బెస్ట్ ” అంటూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్





**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, ఆయా ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించని ఇళ్లు ఏమైనా ఉన్నాయా, నిర్మాణ పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా, నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనులకు అవసరమైన సాంకేతిక సహాయం తదితర సౌకర్యాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు లేదా సహాయం అవసరమైతే, అధికారులు దగ్గరుండి వాటిని పరిష్కరిస్తూ నిర్మాణ పనులు సజావుగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల అధికారులను మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు.

## కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తున్నాం

- అనారోగ్యం భారినపడితే నిర్లక్ష్యం చేయొద్దు
- కార్మికుల సంక్షేమానికి సమష్టి కృషిదు
- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్
- కార్పొరేషన్ కార్యాలయంలో వైద్యశిబిరం విజయవంతం





**ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** కార్మికుల ఆరోగ్య రక్షణకు మున్సిపల్ కార్పొరేషన్ అధిక ప్రాధాన్యతనిస్తుందని, నిరంతరం శ్రమిస్తూ పట్టణ ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది శ్రేయస్సుకు అన్నివేళలా అండగా ఉంటామని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కార్పొరేషన్ పరిధిలోని శానిటరీ, వాటర్ సప్లై, విద్యుత్ సరఫరా, ఆఫీస్ సిబ్బంది, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యం కోసం రేయింబవళ్లు కష్టపడే పారిశుధ్య, నీటి సరఫరా విభాగాల కార్మికులు తమ సొంత ఆరోగ్యం పట్ల కూడా తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలో తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కార్పొరేషన్ యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని సుమారు 300 మంది కార్మికులకు రక్తపోటు, మధుమేహం తదితర జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సుజాత, కార్పొరేషన్, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు నమోదు చేసుకోండి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**ఖమ్మం, హైదరాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** శాసన మండలిలోని రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు గాను తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పట్టభద్రులను కోరారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్, హైదరాబాద్ -రంగారెడ్డి-మహబూబ్ నగర్ జిల్లాల రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరుగుతాయన్నారు.ఈ ఉమ్మడి జిల్లాలకు చెందిన పట్టభద్రులు ఫారం -18 పూర్తి చేసి నవంబర్ 6వతేదీ లోగా ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసి ఓటు హక్కు పొందాల్సిందిగా ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర కోరారు."మన ఓటు-మన హక్కు"నినాదంతో 2023 నవంబర్ నాటికి ఏదేనీ డిగ్రీ లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. పట్టభద్రుల ఎన్నికల్లో ఇంతకుముందు ఓటేసిన వాళ్లు కూడా తమ పేర్లను తిరిగి నమోదు చేసుకోవలసి ఉంటుందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ఇందుకుగాను ఓటరు గుర్తింపు,ఆధార్ కార్డులతో పాటు డిగ్రీ/గ్రాడ్యుయేట్ ధృవీకరణ పత్రం,పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నంబరుతో తమ పేర్లను (ఓట్లు) నమోదు చేసుకోవాల్సిందిగా ఎంపీ వద్దిరాజు పట్టభద్రులను కోరారు.

## గుండెపోటుతో సీపీఐ సీనియర్ కార్యకర్త మృతి

- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్



**ఖమ్మం , సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం రూరల్ మండలం దారేడు గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ కార్యకర్త సొంటి ధనుంజయ్ (62) గుండెపోటుతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందారు.విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ సొంటి ధనుంజయ్ మృతి సీపీఐకి, దారేడు గ్రామానికి తీరని లోటని అన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కరుణకుమార్, మండల సమితి సభ్యులు బత్తిని సీతారాములు, దేవరపల్లి వెంకటకృష్ణ, పల్లె నరసింహారావు, తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, అనంతల శారద, ఎస్.కె. జానీ, గ్రామ సర్పంచ్ బత్తుల వెంకన్న, ఉప సర్పంచ్, సీపీఐ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

# India Today Conclave South 2026లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం, సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులపై కీలక చర్చ



**హైదరాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** కొచ్చిలోని Grand Hyattలో జరిగిన India Today Conclave South 2026 సదస్సులో “The Next Chapter: Growth, Governance and Opportunity in Telangana” అంశంపై తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం, ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడి అవకాశాలతో పాటు ఎన్నికల వ్యవస్థ, కేంద్ర–రాష్ట్ర ఆర్థిక సంబంధాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘంపై ప్రజలకు విశ్వాసం ఉండాలి**

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘానికి అత్యంత కీలకమైన బాధ్యత ఉందని, ఎన్నికలు ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయనే విశ్వాసాన్ని దేశ ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ఎన్నికల్లో చాలా నియోజకవర్గాల్లో గెలుపు, ఓటముల మధ్య స్వల్ప తేడా ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో ఒక్కో నియోజకవర్గంలో 25 వేల నుంచి 40–50 వేల వరకు ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తే వాటిపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.సోషల్ మీడియా విస్తృతమైన ప్రస్తుత పరిస్థితుల్లో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా ఓటర్ల రాజకీయ అభిరుచులను అంచనా వేయడం సులభమైందన్నారు. ఒక పార్టీకి అనుకూలంగా ఉన్నారని భావించే ఓటర్లను గుర్తించి వారి పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలను రాహుల్ గాంధీ చాలా కాలంగా ప్రస్తావిస్తున్నారని తెలిపారు.“కాంగ్రెస్ గెలిచిందా.. ఓడిందా అనేది ఇక్కడ ప్రశ్న కాదు. గెలుపు, ఓటములకు అతీతంగా ఎన్నికల ప్రక్రియపై ప్రతి పౌరుడికి విశ్వాసం ఉండాలి” అని స్పష్టం చేశారు.

**బ్యాలెట్ పేపర్‌పై ప్రజలకు నమ్మకం ఉంటే ఆ దిశగా ఆలోచించాలి**

తాము వేసిన ఓటు ఎవరికి వెళ్తుందనే విషయంలో ఓటర్లకు అనుమానం ఉంటే దానిని తొలగించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనన్నారు. ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానంపైనా ఆలోచించాలని అభిప్రాయపడ్డారు.ఎన్నికల సంఘం రాజకీయాలకు అతీతంగా స్వతంత్ర సంస్థగా పనిచేస్తుందనే విశ్వాసం ప్రజల్లో ఉండాలని, ప్రస్తుతం ఆ విశ్వాసాన్ని కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందన్నది తమ అభిప్రాయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.“ఈ విషయాన్ని నేను కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ప్రశ్నించడం లేదు. ముందు నేను ఈ దేశ పౌరుడిని. నా ఓటు నేను కోరుకున్న అభ్యర్థికే వెళ్తుందా? నా పేరు ఓటర్ల జాబితాలో ఉంటుందా? అనే అనుమానం ఏ పౌరుడికీ రాకూడదు” అని అన్నారు.సర్ ప్రక్రియలో అనేక మంది పేర్లు సందేహాస్పద జాబితాల్లోకి వెళ్లాయని, రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా ఉన్న నాయకుల విషయంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని పేర్కొన్నారు.

**తెలంగాణలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం**

తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల సహాయం అందిస్తున్నామని, మొదటి విడతలో సుమారు 4.50 లక్షల ఇళ్లను ప్రారంభించి, మరో రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.అర్హులైన కుటుంబాలకు వైద్య సహాయాన్ని రూ.10 లక్షల వరకు విస్తరించామని, మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన మొత్తాన్ని ఆర్థిక శాఖ నుంచి రవాణా శాఖకు చెల్లిస్తున్నామన్నారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ద్వారా లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామని వివరించారు.

**ఇవి ఉచితాలు కాదు, ప్రజలపై పెట్టుబడి**

ప్రజలకు అందిస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ‘ఫ్రీబీ’గా చూడటం సరైంది కాదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.“ఇల్లు లేని వ్యక్తికి ఇల్లు కట్టిస్తే అతనిలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెరుగుతాయి. పేద కుటుంబానికి మంచి ఆహారం అందిస్తే ఆరోగ్యంగా పనిచేయగలుగుతుంది. పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తే అత్యుత్తమ మానవ వనరుగా ఎదిగి రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వామి అవుతాడు. అందుకే సంక్షేమంపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు కాదు. మానవ వనరులపై పెట్టుబడి” అని పేర్కొన్నారు.రైతులకు ఎకరాకు రూ.12 వేల చొప్పున అందించే పెట్టుబడి సహాయం సాగుకు ఉపయోగపడుతుందని, తద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు చివరకు రాష్ట్ర ఉత్పాదకతను, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని వివరించారు.

**దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక సహకారాన్ని గుర్తించాలి**

తెలంగాణ కేంద్రానికి పన్నుల రూపంలో గణనీయమైన ఆదాయాన్ని అందిస్తోందని, అయితే కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి తిరిగి వచ్చే వాటాపై పునరాలోచన అవసరమని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఈ అంశంపై చర్చ జరుగుతోందన్నారు.“దేశం అనేది రాష్ట్రాల సమాఖ్య. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎక్కువగా సహకరిస్తూ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను నీరుత్సాహపరచకూడదు” అని పేర్కొన్నారు.రాష్ట్రాల మధ్య పెట్టుబడుల కోసం పోటీ ఉండటం మంచిదేనని, తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటీపడటం ఆరోగ్యకరమైన పరిణామమని చెప్పారు.

తెలంగాణకు అనుకూలమైన వాతావరణం, భారీ టాలెంట్ పూల్, సాంకేతిక నైపుణ్యం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు ఉన్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను సాంకేతిక విద్య వైపు ప్రోత్సహించడం వల్ల హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉందన్నారు.అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ, ప్రతిభావంతమైన మానవ వనరులు తెలంగాణకు ప్రధాన బలాలని పేర్కొన్నారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణ బలంగా పోటీపడగలదన్నారు.

**వైఎస్సార్ నాకు నేర్పిన కాంగ్రెస్ విలువలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డితో తనకున్న అనుబంధాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేసుకున్నారు. తాను ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో చీఫ్ విప్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు నిర్వహించిన శిక్షణ తరగతులకు వైఎస్సార్ హాజరై పార్టీ సిద్ధాంతాలు, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర గురించి వివరించేవారని తెలిపారు.“అన్ని మతాలు, అన్ని వర్గాలను కలుపుకొని దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలిగేది కాంగ్రెస్. మీ జీవితకాలంలో కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే పని చేయకండి అని వైఎస్సార్ మాకు చెప్పేవారు” అని గుర్తుచేసుకున్నారు.

**కాంగ్రెస్‌ను వీడిన నాయకులందరూ తిరిగి రావాలి**

దేశవ్యాప్తంగా గతంలో కాంగ్రెస్‌లో పనిచేసి ప్రస్తుతం ఇతర పార్టీల్లో ఉన్న నాయకులందరూ తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.“గతంలో కాంగ్రెస్‌లో పనిచేసి పార్టీని వీడిన నాయకులందరూ తిరిగి రండి. మళ్లీ కలిసి పనిచేద్దాం. కాంగ్రెస్ సిద్ధాంతాలను అమలు చేస్తూ అన్ని మతాలు, అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలను కలుపుకొని దేశాన్ని బలోపేతం చేద్దాం” అని పిలుపునిచ్చారు.

**సీఎం రేవంత్ రెడ్డితో పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాం**

కాంగ్రెస్ పార్టీలో నాయకులను కులం ఆధారంగా చూడనని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో పనిచేసే ప్రతి ఒక్కరూ పార్టీ నాయకులు, కార్యకర్తలేనని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించి తీసుకునే నిర్ణయాలను నిబద్ధత కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా గౌరవిస్తానన్నారు.“ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాం. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. మేము చర్చించుకుంటాం.. సమాలోచనలు జరుపుకుంటాం. ఒక నిర్ణయానికి వస్తాం. ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ సిద్ధాంతాలను పాలన ద్వారా అమలు చేసేందుకు కలిసి పనిచేస్తాం” అని స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, నాణ్యమైన విద్య, పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణను మరింత బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మామిళ్లగూడెం అర్బన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు





**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కేంద్రంలో జరుగుతున్న సాధారణ వ్యాక్సినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేంద్రంలోని ఓపీ, ల్యాబ్, వ్యాక్సినేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం వైద్య సిబ్బందికి ఇమ్యునైజేషన్ షెడ్యూల్ టీకాల అనంతరం చాలా అరుదుగా తలెత్తే దుష్ప్రభావం సమర్థవంతమైన నిర్వహణపై పలు కీలక సూచనలు చేస్తూ రీ-ఎడ్యుకేట్ చేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణుల సంరక్షణ కోసం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ల శాతాన్ని మరింతగా పెంచాలని ఆదేశించారు. పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాల్లో సేవల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు.ప్రజల్లో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు, నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాల నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపి, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో మామిళ్లగూడెం యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ శ్రావ్య, సీహెచ్‌వో సంధ్యారాణి, నర్సింగ్ ఆఫీసర్ నాగమ్మ, ఫార్మసిస్ట్ పి. లక్ష్మి , అకౌంటెంట్ నాగాలక్ష్మి , ఏఎన్‌ఎంలు రాజేశ్వరి, హేమలత, దయామణి, నాగరాణి, చంద్రమణి, భవాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీవీసీ సర్కిల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు





**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని వీవీసీ సర్కిల్ వద్ద వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరిగింది.ఖమ్మం సిటీ వైపు నుంచి వచ్చే వాహనాలు, బైపాస్ వైపు నుంచి వచ్చే వాహనాలు, అలాగే ఖమ్మం నగరంలోకి ప్రవేశించే వాహనాలు సర్కిల్ వద్ద క్రమబద్ధంగా రాకపోకలు సాగించేలా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, వాహనదారులకు సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ, రోడ్డు భద్రతకు సహకరించాలి అని తెలిపారు.

# మెట్ట వరి సాగులో సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

- తిమ్మినేనిపాలెంలో ఘనంగా 'పొలంబడి' కార్యక్రమం
- తక్కువ నీటితో డ్రిప్ సాగు, వెదజల్లే పద్ధతి లాభదాయకం : సర్పంచ్ చాపలమడుగు వీరబాబు



**ఖమ్మం, తిమ్మినేనిపాలెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మెట్ట వరి సాగులో అతిగా రసాయన పురుగుమందులను వాడకుండా సమగ్ర సస్యరక్షణ (ఐపిఎం) పద్ధతులను పాటించడం వల్ల తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్త సౌజన్యంతో చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామంలోని మెట్ట వరి పొలంలో బుధవారం నిర్వహించిన 'పొలంబడి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిమ్మినేనిపాలెంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**తక్కువ నీటితో సమర్థవంతమైన సాగు, కూలీల ఖర్చుకు చెక్**

సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన రైతు కూచిపూడి కోటేశ్వరరావు తన మెట్ట పొలంలో సాంప్రదాయ నాటు పద్ధతిలో కూలీల ఖర్చు ఎక్కువగా ఉండటంతో, భిన్నంగా ఆలోచించి వరి విత్తనాలను నేరుగా వెదజల్లి సాగు చేశారని తెలిపారు. అంతేకాకుండా, ఆ మెట్ట పొలానికి డ్రిప్ సిస్టమ్ (బిందు సేద్యం) అమర్చి అతి తక్కువ నీటితో వరి పంటను విజయవంతంగా పండిస్తున్నారని పేర్కొన్నారు.ఈ విధానం వల్ల నీటి కొరత సమస్య తీరడమే కాకుండా, పంటకు అవసరమైనంత నీరు అంది వరి మొక్కలు అత్యంత సౌకర్యవంతంగా, ఆరోగ్యకరంగా పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. మొక్కలు దూర దూరంగా ఉండటం వల్ల వెలుతురు, గాలి బాగా తగిలి ప్రతి వరి దొబ్బుకు దాదాపు 30 వరకు పిలకలు తొడిగి పంట బలంగా ఎదిగిందని వివరించారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితోనే ఎకరానికి సుమారు 36 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నూతన సాగు విధానాన్ని చూసి చుట్టుపక్కల రైతులు సైతం విశేషంగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. తిరుమలాపురం గ్రామంలో కూడా వరి సాగు చేస్తున్న రైతులకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు వ్యవసాయ శాఖ అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ ఐ. వాణిశ్రీ, ఎఫ్‌టీసీ ఏడీఏ మిట్టపల్లి సతీష్, ఎఫ్‌టీసీ ఏఓ ఇంటూరి భాస్కర్, ఎఫ్‌టీసీ ఏఓ అబ్బూరి సతీష్, చింతకాని ఎంఏఓ పి. సతీష్, ఏఈఓ కార్తీక్, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తిమ్మినేనిపాలెం గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు, ఉప సర్పంచ్ కూచిపూడి బుచ్చిబాబు, బద్రి, దమ్మాలపాటి వీరయ్య, షేక్ అబ్దుల్, ఎస్‌కే మదర్, దమ్మలపాటి వెంకటేశ్వర్లు, ఆళ్ల శ్రీనివాసరావు, మొనగాల హనుమంతరావు, గోగుల నరసింహారావు, మరీదు మధు తదితర రైతులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దమ్మాయిగూడెం లో పోషణ మాసోత్సవ కార్యక్రమం



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోఉత్సవాల కార్యక్రమం దమ్మాయిగూడెంలో ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబర్ నెలలో నిర్వహించే జాతీయ కార్యక్రమం పోషణ మాస ఉత్సవాలు అని సూపర్వైజర్ సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026వ సంవత్సరంలో ఇది తొమ్మిదవ జాతీయ మాసొత్సవం తెలంగాణలో మంత్రి సీతక్క సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు కార్యక్రమం నిర్వహించాలని ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు కార్యక్రమం క్యాలెండర్ను విడుదల చేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అన్న ప్రసన్న, గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేస్తారని అలాగే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ఆమె అన్నారు. పోషకాహార ప్రదర్శన, అవగాహన ర్యాలీలు నిర్వహించి పిల్లల సంరక్షణ విషయంలో సమాజాన్ని చైతన్య పరుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, వైవిధ్యభరితమైన పోషణ పరిష్కారం, అంగన్వాడీలో వేడిగా వండిన భోజనం, సమాజ భాగస్వామ్యం మరియు బాధ్యత, పోషణ ప్రాథమిక విద్య బాలల వికాసం, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, మాతృ సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడెం గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద, గర్భిణీలు షేక్ రేష్మ, పేగు పూలనదేవి , ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సావిత్రి, తల్లులు బాజె స్పందన, సొందుబి,నవిత, రమ్య, కస్తూరమ్మ, అంగన్వాడీ టీచర్స్ ఎస్ పద్మ, కే మలుసూరమ్మ, నాగేంద్ర, నాగమణి, నిర్మల, జయమ్మ, ఎల్లమ్మ, ఉపేంద్ర, రేణుక, రంగనాయకమ్మ,ఆశ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం ను తీసుకోవాలి

- ఐడీసీఎస్ సీడీపీవో యం కవిత



**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం ను తీసుకోవాలని ఐసీడీఎస్ తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ సీడీపీవో యం కవిత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పోషక మాసోత్సవం ను నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో తయారు చేసిన వివిధ వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. దీని వలన రక్తహీనత, పోషకాహార లోపం ను నివారించవచ్చునని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు, సర్పంచ్శీలం వెంకటలక్ష్మి , వైద్యాధికారులు ఆర్.శ్రావణకుమార్, గీత, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయా లు తదితరులు పాల్గొన్నారు.

# 44 వ డివిజన్ లో సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ





**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగేందర్ సూచనల మేరకు 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలెపు వెంకటరమణ సహకారంతో లబ్ధిదారులకు చెక్కుని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్.



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** భూ రీ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం చుంచుపల్లి మండలంలో పర్యటించిన ఆయన గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొత్తం 2,027 ఎకరాల 30 గుంటల భూమికి సంబంధించిన సర్వేలో భూ సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.అనంతరం చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించి, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.మేధో వైకల్యం కలిగిన, పాఠశాలకు హాజరుకాలేని విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## దహన సంస్కారాలకు నిరుపేద కుటుంబానికి 'సమాచారం గ్రూప్' అండ.



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** కుటుంబ పెద్ద ఆకస్మిక మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి 'సమాచారం గ్రూప్' అండగా నిలిచింది. భద్రాచలం అంబ సత్రం సమీపంలోని నరసింహస్వామి ఆలయం పక్కన బరకాలతో గుడారం వేసుకుని జీవిస్తున్న ఎన్. రాజు మంగళవారం సారపాక రోడ్డుపై ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో భార్య, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు.కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉండటంతో దహన సంస్కారాలకు అవసరమైన డబ్బులు కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయాన్ని స్థానికుడు దుర్గ సమాచారం గ్రూప్ అడ్మిన్ రాజా కిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాజా కిరణ్ గ్రూప్ సభ్యుడు 'భారత్'కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన భారత్ దహన సంస్కారాల కోసం రూ.5,000 ఆర్థిక సాయం అందించారు.గ్రూప్ సభ్యుడు కోకిరాల రవితో కలిసి బాధిత కుటుంబానికి నగదును అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ రాజా కిరణ్ మాట్లాడుతూ.. పేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటారని అభినందించారు. సాయం అందించిన వారికి మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో వెల్జాల్‌లో ఘనంగా నూతన గృహ భూమి పూజ

- **మాజీ ఎంపీపీసీఎల్ శ్రీనివాస్ యాదవ్, వానరాశి వెంకటేష్**



**తలకొండపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో నూతన గృహ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహకారంతో స్థానిక లబ్ధిదారులు పుల్జాల కృష్ణవేణి – కృష్ణయ్య దంపతుల నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్,సర్పంచ్ తనయుడు వానరాసి వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహ నిర్మాణం ఎలాంటి అడ్డంకులు లేకుండా,త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.బాధితులకు ఇల్లు త్వరగా నిర్మించుకునేలా అందరం కలిసికట్టుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు శివ విజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముజిబూర్ రెహమాన్, విష్ణువర్ధన్ యాదవ్, వార్డు సభ్యులు శేఖర్ యాదవ్, దూల్ల శ్రీశైలం, పుల్జాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం కార్యాలయంలో సర్వసభ సమావేశం

- **సహకార సంఘంలో రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు చెల్లించి కొత్తరుణాలు పొందాలి.**
- **వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి**





**ఇబ్రాహీంపట్నం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మంచాల మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సందర్భంగా సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు గతంలో తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు వెంటనే చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలి సరైన సమయంలో రుణాలు చెల్లించాలి అని అన్నారు.స్వయం ఉపాధి ద్వారా తీసుకున్న బకాయి రుణాలు వన్ టైం సెటిల్మెంట్ చేసుకుని రుణాలు చెల్లించాలి అన్నారు. నోముల గ్రామంలో ఉన్న సహకార సంఘం భవనంలో భూసార పరీక్ష కేం ద్రాన్ని ఏర్పాటు చేస్తాం. ఆరుట్ల గ్రామంలోని సహకార సంఘం స్థలంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ పూర్తయినందున రైతులకు సీరియల్ ప్రకారం దుకాణాలు కేటాయిస్తాం. రైతులకుఏ లాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిసౌకర్యాలు కల్పిస్తాం అని అన్నారు. రైతులు సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలు సరైన సమయంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలి సహ కార సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరైతు సహకరించాలి అనిఅన్నారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గం సభ్యులు యాదయ్య అరుణమ్మ వింజమూరు రామచంద్రారెడ్డి జెనిగె వెంకటేష్ యాదవ్, పంది రమేష్ పి మణెమ్మ సహకార సంఘం ముఖ్యకార్య నిర్వహణ అధికారి అచ్చన రమేష్ కార్యదర్శి ,ఎం శ్రీనివాస్ క్యాషియర్ ,కొండ్రు సంతోష్, క్లర్కు రావుల లింగం సెల్స్ మెన్ ,పి శ్రీకాంత్, అటెండర్ ,కే బుగ్గ రాములు,వి సద్గుణ రైతులు తదితరులు పాల్గొ న్నారు.

## బిజెవైఎం జిల్లా కార్యదర్శిగా తూంపల్లి గ్రామ వాసి భూస రాజు నియమాకం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా తూంపల్లి గ్రామానికి చెందిన భూస రాజు నియమితులయ్యారు. బిజెపి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న రాజుకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భూస రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గారికి, బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి గారికి, ఇతర ముఖ్య నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వాన్ని కదిలించేలా శ్రమిస్తానని, బిజెవైఎంను జిల్లాలో మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణమా?

- **అధికారుల పర్యవేక్షణపై స్థానికుల అనుమానాలు**



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** కూకట్‌పల్లి పరిధిలోని దేవి నగర్ రోడ్ నెంబర్ –2 ఓ నివాస ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ ప్రాంతంలో భారీ స్థాయిలో వెదురు కర్రలతో తాత్కాలిక పరంజాలు ఏర్పాటు చేసి పనులు చేపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.నిర్మాణానికి సంబంధించి అనుమతులు ఉన్నాయా? భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై స్థానికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ తీగలకు సమీపంలోనే నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ప్రమాదాలపై ఆందోళన వ్యక్తమవుతోంది.సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్మాణ అనుమతులు, భవన ప్రణాళిక, సెట్‌బ్యాక్‌లు, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నక్క వాసు తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్న జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రత్నకుమార్.



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ప్రముఖ రిపోర్టర్, జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యుడు నక్క వాసు తల్లి అమ్మ సువర్ణ మృతిచెందడంతో జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, దళిత జర్నలిస్ట్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో ఆయన పాల్గొని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అమ్మ సువర్ణ మృతిచెందిన విషయం తెలుసుకున్న రత్నకుమార్ మణుగూరుకు చేరుకుని ఆమె పార్థివదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నక్క వాసు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో రత్నకుమార్ పాల్గొని పాడె మోశారు. జర్నలిస్ట్ కుటుంబ సభ్యురాలి అంతిమయాత్రలో పాల్గొని కుటుంబానికి తోడుగా నిలవడం తోటి జర్నలిస్టుల్లోనూ చర్చనీయాంశమైంది.ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ, అమ్మ సువర్ణ మృతి నక్క వాసు కుటుంబానికి తీరని లోటని అన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల కుటుంబాల్లో విషాదం చోటుచేసుకున్నప్పుడు జిల్లా ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.అంతిమయాత్రలో జర్నలిస్టులు, స్థానికులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొని అమ్మ సువర్ణకు కన్నీటి వీడ్కోలు పలికారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# పేరుకే పెద్ద ఆసుపత్రి

- రూ.11 కోట్ల ఆస్పత్రి, వైద్యం మాత్రం అందని ద్రాక్ష
- 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది కొరత, ఒకే డాక్టర్‌తో వందలాది మంది రోగులకు వైద్యం
- గైనకాలజిస్ట్, చిన్నపిల్లల వైద్యుడు ఎక్కడ
- ఉదయం నుంచి రోగుల పడిగాపులు
- వరంగల్ నుంచి చిన్నపిల్లల వైద్యుడిని కేటాయించినా విధులకు హాజరు కాలేదంటున్న సమాచారం
- డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యుడి హాజరుపైనా ఆరోపణలు
- జిల్లా అధికారుల దృష్టికి ఫిర్యాదులు
- ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా, వైద్యం కోసం ఖమ్మం, తిరువూరుకు వెళ్లాల్సిందేనా అని ప్రజల ఆవేదన




**ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గంలో గల కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రూ.11 కోట్ల వ్యయంతో 50 పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకున్న ఈ ఆస్పత్రి, వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులకు పూర్తి స్థాయి సేవలు అందించలేకపోతోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకే డాక్టర్, వందలాది మంది రోగులు**

మంగళవారం వివిధ గ్రామాల నుంచి సుమారు 220 మంది వరకు వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. అయితే అందుబాటులో ఉన్న వైద్యుల్లో ఒకే ఒక్క డాక్టర్ రోగులను పరిశీలించాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఉదయం నుంచి రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చిందని పలువురు వాపోయారు.ఒకే వైద్యుడు ఇంతమంది రోగులను పరిశీలించడం సాధ్యమవుతుందా, అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితి ఏమిటి, అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**మహిళా రోగులకు గైనకాలజిస్ట్,**

పిల్లలకు పీడియాట్రిషియన్ ఏరి? మహిళలు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వస్తున్నప్పటికీ గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడం ఇబ్బందులకు కారణమవుతోందని రోగులు చెబుతున్నారు. మరోవైపు చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలకు అనారోగ్యం వచ్చినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు ప్రభుత్వ ఆస్పత్రులపైనే ఆధారపడుతున్నాయని, ఇక్కడ వైద్యుడు అందుబాటులో లేకపోతే ఖమ్మం, తిరువూరు వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యుడి హాజరుపైనా ఆరోపణలు**

కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న ఒక ప్రముఖ వైద్యుడు సత్తుపల్లి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారని, అయితే ఆయన క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.అదేవిధంగా ఆ వైద్యుడు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో ప్రైవేటు నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులు విధుల హాజరు, డిప్యూటేషన్ నిబంధనలు, ప్రైవేటు ప్రాక్టీస్‌కు సంబంధించిన నిబంధనలు పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**జిల్లా అధికారి దృష్టికి సమస్య**

ఆస్పత్రిలో వైద్య సేవలు, వైద్యుల హాజరు, సమయపాలన తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లా అధికారి రాజశేఖర్ గౌడ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు చేపడతామని ఆయన తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

**రూ.11 కోట్ల భవనం, వైద్యులు లేకపోతే ప్రయోజనం ఎంత?**

ఏళ్ల తరబడి కల్లూరు ప్రజలు ఎదురుచూసిన 50 పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చినా, అవసరమైన వైద్యులు, సిబ్బంది లేకపోతే దాని పూర్తి ప్రయోజనం ప్రజలకు ఎలా అందుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.భవనం నిర్మించడం మాత్రమే కాదు. అందులో నిరంతర వైద్య సేవలు అందేలా చూడడం కూడా ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ఐదుగురు డాక్టర్స్ ఉన్నారని అందులో మెడికల్ సూపరింటెండెంట్ రమేష్ శనివారం నుండి లీవ్ లో ఉన్నారని 17 మంది స్టాఫ్ నర్స్, ఒక హెడ్ నర్స్, ఏఎన్ఎంలు 2, ల్యాబ్ 2, ప్రస్తుతం ఫార్మసిస్ట్ సెలవు లో ఉన్నారని అట్టి బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్స్ ఉదయ్ శ్రీ విధులు నిర్వహిస్తున్నారని అధికారి తెలిపారు. ఫార్మసిస్ట్ లేకుండా అవగాహన లేకుండా మందులు ఇస్తే రోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. స్టోర్ మైంటైన్ చేయాలంటే ఫార్మసిస్టుతో పాటు ఖచ్చితమైన అధికారి పర్యవేక్షణ ఉండాలి. పర్యవేక్షణ చేయవలసిన అధికారులు సరైన రీతిలో సక్రమమైన పద్ధతులలో వైద్యం అందించవలసిన అధికారులు నమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఇది ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ దూర ప్రాంతాల నుంచి పేదలు వైద్యం కోసం వస్తుంటే, కీలక విభాగాలకు వైద్యులు లేకపోవడం, ఒకే డాక్టర్‌పై అధిక భారం పడటం, సిబ్బంది హాజరుపై ఫిర్యాదులు రావడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే ప్రత్యేక తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో కేవలం హామీలకే పరిమితం కాకుండా.. వైద్యుల హాజరు, సిబ్బంది కొరత, మందుల లభ్యత, గైనకాలజీ, పీడియాట్రిక్ సేవలు, డిప్యూటేషన్ వైద్యుల విధులు, ఆస్పత్రి నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రతిష్టాత్మ కరంగా మారునున్న ఖమ్మం జిల్లా ఐఆర్ సి ఎస్ ఎన్నికలు




**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు అక్టోబర్ 4 ఆదివారం టీటీడీసీ భవనంలో జరగనున్న ఈ మొత్తం 15 మంది పాలకవర్గ సభ్యులకు గాను 39 అభ్యర్థులు ఎన్నికల బరిలో తలపడుతున్నారు. మొత్తం 2430 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతోంది పోలింగ్ మిషన్ వెంటనే ఓట్ల లెక్కింపు ఫలితాలను విడుదల చేస్తారు. అనంతరం ఆఫీస్ బ్యానర్లను ఎన్నుకుంటారు. ఖమ్మం జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ 2010 లో 656 మందితో ప్రారంభించబడింది ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఏకగ్రీవంగానే కొనసాగుతోంది. ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బరిలోకి దిగి పోటీలో తలపడుతున్న రూ. ఈ సంస్థకు జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ఐ ఆర్ సి ఎస్ ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతాలలో మారుమూల ప్రాంతాలలో వైద్య సేవలను అందించడం పట్టణాలలో పల్లెలలో ప్రముఖ డాక్టర్లతో వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య శిబిరాలను నిర్వహించడం. వరదలు కరువు కాటకాలు విపత్కర పరిస్థితిలో ఎదురైనప్పుడు ఆహారం మందులు దుప్పట్లు దుస్తులు అందించడం, వివిధ ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు వైద్య సేవలు అందించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. గతంలో పనిచేసిన కమిటీ వారు విస్తృత సేవలను అందించే ఈ సంస్థ కార్యకలాపాలలో పాల్గొని ఈ సమస్య యొక్క పేరు ప్రఖ్యాతలు ఇనుమడింప చేయడమే కాక ఖమ్మం శాఖకు ప్రత్యేక గుర్తింపుని తెచ్చారు. అదే బాటలోనే సేవలను అందించాలని దృక్పథంతో పోటీ తత్వం ఏర్పడి ఎన్నికలు జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లా కు చెందిన పేరు ప్రఖ్యాతలు గడించిన వైద్యులు ఈసారి రంగంలో దిగారు. అంతేకాకుండా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సైతం పోటీలో నిలబడి ఉన్నారు. పోటీన నిలబడిన వారిలో కొందరు అనేక సేవా కార్యక్రమాలలో లలో యూత్ కార్యక్రమాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అభివృద్ధిలో సేవలను అందిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలు కూడా వారు వారి వారి ఆసుపత్రుల ద్వారా నిర్వహించిన సంఘటనలు కూడా ఉన్నాయి. అందరూ ప్రముఖ స్వచ్ఛంద సంస్థలకు అధ్యక్షులు కార్యదర్శిగా ఉంటూ సేవను కూడా అందిస్తున్నారు. ఎవరు గెలిచినా సేవా తప్పరతే వారి ధ్యేయంగా చెప్పవచ్చు. ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ పేరు ప్రఖ్యాతలు మరింత చేస్తారని ఆశిద్దాం.

## స్నేహితులకు తీపిగుర్తుగా నిలిచిన 45 వసంతాల ఫోటో




**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** విద్యార్థి దశలో దిగిన ఫోటోలు ఎంతో ఆనందాన్నిస్తాయి, కాలగమనంలో ఎన్ని సంవత్సరాలు గడిచిపోయినా ఫోటో ఒక తీపిగుర్తుగా నిలిచిపోతుంది. విశాఖపట్నం లోని ఆంధ్రావిశ్వవిద్యాలయం లో 1979 – 81 బ్యాచ్ కు చెందిన యం.కామ్ విద్యార్థుల ఫోటో ను సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్య నారాయణ " నేటి శుభోదయ " పత్రికా ప్రతినిధికి అందజేశారు. తాను ఆంధ్రావిశ్వవిద్యాలయంలోని కామర్స్ డిపార్ట్మెంట్ లో యం.కామ్ చదివి ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణుడనయ్యానని ఆయన తెలిపారు.

## ఆలోచింపజేసిన ఇంగ్లీష్ ఎక్స్ పో



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** విద్యార్థులలో నిగూఢంగా ఉండే భాషానైపుణ్యాలు స్రృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్ ను వెలికితీసేందుకు ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాల ఇంగ్లీష్ విభాగం గురువారం నిర్వహించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎక్స్ పోను కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ప్రారంభించారు. భాషలో ఉండే పదాలు వాటి వాడుక లో ఉండే ప్రత్యేకతలు వాక్యనిర్మాణం లో ఉండే లయాత్మకత, భాషలో ఉండే వ్యాకరణ అంశాలను 70 మంది వివిధ విభాగాల కు చెందిన విద్యార్థులు చార్టుల ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతి, లాంగ్వేజెస్ సైన్స్ విభాగ వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ నర్సమ్మ, ఆర్ట్స్ కామర్స్ వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, ఎక్స్ పో కోఆర్డినేటర్ బంగారి,ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద విభాగ అధ్యాపకులు డా.ఎం.రాంబాబు,కె.రవికుమార్,సరిత,డా.విజయలక్ష్మి , శివాజి బి.కోటేశ్వర రావు, వివిధ విభాగాల విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రోబోటీక్స్ పై వర్క్ షాప్




**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆటో మెషిన్ వంటి సాంకేతిక తలకు ప్రాధాన్యత పెరుగుతోందని విద్యార్థులు పాఠ్యంశ పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక సాంకేతిక నైపుణ్యాలు లను పెంచుకోవాలని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా సూచించారు. గురువారం ఫిజిక్స్ విభాగాధిపతి డా.జె.అనిత అధ్యక్షతన రోబోటిక్స్ పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. సోహమ్ అకాడమీ సౌజన్యం తో రోబోటిక్స్ లో ఉపయోగించే పద్ధతులు వివిధ రంగాల్లో రోబోటిక్స్ అనువర్తనాలు తదితర అంశాల్పై రిసోర్స్ పర్సన్ పవన్ కుమార్ ప్రయోగాత్మక శిక్షణ అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏ ఎల్.ఎన్ శాస్త్రి, డా.ఏ నర్సమ్మ విభాగ అధ్యాపకులు ఎస్.రాంబాబు, డా.బి.శ్రీనివాస్, రాజశేఖర్,డా.కె.కిరణ్ కుమార్,డా.ధర్మయ్య ,వి.అనురాధ ,90మంది విద్యార్థులు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. తొలుత ఉదయం 9:10 గంటల నుంచి తల్లాడ మండలంలో రెండు కుటుంబాలను పరామర్శిస్తారు. ఆ తర్వాత ఉదయం 10:30 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ ప్రాంతంలో పునరుద్ధరించిన టీజీఎన్పీ డీసీఎల్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనాలను మంత్రి ప్రారంభిస్తారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ధర్పల్లిలో జీపీ నిధులతో నూతన హైమాస్ట్ (హైమాక్స్) లైట్లు ప్రారంభం



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం అధికారికంగా ప్రారంభించారు। ఈ సందర్భంగా ప్రతిపాదించిన నూతన విద్యుత్ వెలుగులతో గ్రామంలో రాత్రివేళల్లో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులకు మరింత సౌకర్యం కలగనుందని ప్రజాప్రతినిధులు తెలిపారు। గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గ్రామపంచాయతీ నిధులను వినియోగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు। ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ ఆర్మూర్ రంజిత్, ఉప సర్పంచ్ ఎజ్జ శ్రీకాంత్, వార్డు సభ్యుడు గణపురం రాజు తదితరులు పాల్గొన్నారు।

## వ్యాపార అభివృద్ధికి సరికొత్త ఆలోచనలు అవసరం

- **సిరి మహాలక్ష్మి ఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ మీటింగ్**





**నాగోల్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** నాగోల్ నుంచి బండ్లగూడ వెళ్లే మార్గంలోని పీబీఆర్ కన్వెన్షన్‌లో సిరి మహాలక్ష్మి ఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ అండ్ ఎండి కళ్ళం వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వ్యాపార భాగస్వాములు, సభ్యులు పాల్గొన్నారు.ఈ సమావేశానికి ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, లైఫ్ స్కిల్స్ కోచ్ వేణుగోపాల్ లక్ష్మీపురం గెస్ట్ స్పీకర్‌గా హాజరై వ్యాపార అభివృద్ధి, నాయకత్వ లక్షణాలు, సేల్స్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో బిజినెస్ బిల్డింగ్ టిప్స్, సేల్స్ సైకాలజీ, సంస్థ వ్యాపార పురోగతి, రిక్రూట్‌మెంట్ తదితర అంశాలపై చర్చించారు. వ్యాపారంలో లక్ష్యాలను నిర్దేశించుకోవడం, కష్టమర్ల అవసరాలను అర్థం చేసుకోవడం, సమర్థవంతమైన కమ్యూనికేషన్‌తో సేల్స్‌ను మెరుగుపరచడం వంటి అంశాలపై మార్గదర్శకత్వం అందించారు. అనంతరం సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన అచీవర్స్‌ను ఘనంగా సన్మానించి, పలువురికి టాటా ఎఐజి ద్వారా 10 లక్షల సమ్ అస్యూర్డ్ ఇన్సూరెన్స్ చేపించి సర్టిఫికెట్స్ అందజేసి అభినందనలు తెలిపారు. సంస్థ భవిష్యత్ కార్యాచరణ, వ్యాపార విస్తరణకు సంబంధించిన పలు అంశాలను సమావేశంలో వివరించారు.ఈ సందర్భంగా ఎస్ఎంఐడి ఫౌండర్ అండ్ ఎండి కళ్ళం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధితో పాటు ప్రతి సభ్యుడి వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు అవసరమైన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.నిబద్ధతతో పని చేసిన ప్రతి ఒక్కరికి సంస్థ సహకారం ఎప్పటికి ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ అండ్ సీఈఓ హనీమీ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అసోసియేట్స్ తదితరులు పాల్గొన్నారు.

## మంచాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

- **గ్రామ శాఖ అధ్యక్షుడిగా వీళ్ళ కృష్ణ, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ హుస్సేన్**







**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మంచాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీ సభ్యులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు.గ్రామ శాఖ అధ్యక్షుడిగా వీళ్ళ కృష్ణ ఉపాధ్యక్షులు మహ్మద్ హుస్సేన్ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు నూతన కమిటీలో ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు.నూతన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామంలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) మహాజన సభ జయప్రదం

- **ఎరువుల పంపిణీకి యాప్ విధానాన్ని రద్దు చేయాలి: అధ్యక్షుడు చెల్లెము గంగాధర్**
- **సొసైటీ చైర్మన్ ఎన్నిక నామినేషన్ ద్వారా కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగానే జరగాలి**



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా, సిరికొండ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (PACS) మహాజన సభ బుధవారం సొసైటీ అధ్యక్షుడు చెల్లెము గంగాధర్ అధ్యక్షతన అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి గిరిధర్ 2025–26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రగతి నివేదికతో పాటు, జమా–ఖర్చుల వివరాలను సభకు సమర్పించారు. అనంతరం అధ్యక్షుడు చెల్లెము గంగాధర్ మాట్లాడుతూ... ప్రస్తుతం సిరికొండ సొసైటీ ఖాతాలో నిధులతో పాటు రావలసిన బాకీలు రూ. 38 లక్షలతో కలిపి మొత్తం రూ. 1.10 కోట్ల (కోటి పది లక్షలు) వరకు ఆర్థిక నిల్వలు ఉన్నాయని, సొసైటీ రూపాంతరం చెంది బలంగా ముందడుగు వేస్తోందని తెలిపారు.సభలో ఆమోదించిన ముఖ్య తీర్మానాలు:ఎరువుల పంపిణీ: రైతులు ఎరువులు పొందేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న యాప్ విధానం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున, వెంటనే ఆ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే ఎరువుల పంపిణీ ప్రక్రియను కొనసాగించాలి.చైర్మన్ ఎన్నిక పద్ధతి: సొసైటీ చైర్మన్‌ను నామినేటెడ్ పద్ధతిలో నియమించే ఆలోచనను విరమించుకొని, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల (ఎలక్షన్ల) ద్వారానే ఎన్నుకునే విధానాన్ని పునరుద్ధరించాలి.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ (AO) నరసయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ పాలకమండలి డైరెక్టర్లు మరియు మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## అంకితభావంతో సేవలందించిన శశికళ సేవలు మరువలేనివి:మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి





**వికారాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** వికారాబాద్: అనంతగిరిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా అంకితభావంతో విద్యార్థులకు సేవలందించిన ద్వి. శశికళ క్రీస్తుదాసు పదవీ విరమణ సందర్భంగా కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అభినందన సభలో వికారాబాద్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ జర్నలిస్టుల మ్యూచువల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో అంకితభావంతో సేవలందించిన శశికళ సేవలు మరువలేనివని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం శశికళను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## నిధుల బాధ్యత నాది- అభివృద్ధి సంక్షేమం ప్రజలకు చేర్చే బాధ్యత మీది

- **కార్యాలయాలకే పరిమితం కావొద్దు అంకితభావంతో పనిచేయాలి**
- **నిర్లక్ష్యధోరణి వీడని అధికారులపై చర్యలు తప్పవు**
- **ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి**
- **యాచారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష**
- **అధ్వానస్థితిలో ఉన్న యాచారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దటమే లక్ష్యం**
- **అధ్వానస్థితిలో ఉన్న యాచారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దటమే లక్ష్యం**







**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** హైదరాబాద్ నగరాన్ని తలదన్నేలా యాచారం మండలాన్ని తీర్చిదిద్దుతామని అధ్వానస్థితిలో ఉన్న మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు అన్నారు. బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు.గత సమావేశం అనంతరం, చేపట్టిన కార్యక్రమాలు, పథకాల అమలుతీరును ఆయన అడిగి తెలుసుకున్నారు.పలువురు అధికారులు సమావేశానికి హాజరుకాకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే నిర్లక్ష్య ధోరణి వీడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.పాలనలో జవాబుదారీతనం అవసరంఅధికారులు కార్యాలయాలకే పరిమితం కావొద్దని మల్‌రెడ్డి తెలిపారు. పనుల కోసం వచ్చే ప్రజలను చుట్టూ తిప్పుకోకుండా జవాబుదారీతనంతో పని చేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాల అమలులోనూ రాజకీయాలకతీతంగా పేదలను గుర్తించి, అర్హులైన వారందరికీ అందించాలన్నారు. అభివృద్ధికి అవసరమయ్యే నిధుల బాధ్యత తనదని చెప్పిన ఎమ్మెల్యే... అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చే బాధ్యత అధికారులపైనే ఉంటుందని తెలిపారు.భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం.విషపూరిత ఫార్మా ఏర్పాటుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులు... పరిహారం విషయంలోనూ రైతులకు అన్యాయం చేశారని మల్‌రెడ్డి రంగారెడ్డి మండిపడ్డారు.గతంలో ఎకరానికి రూ.8లక్షలిస్తే, తాము పరిహారంతో పాటు కోటిన్నర విలువైన స్థలం బాధితులకిచ్చి ఆదుకుంటున్నట్లు తెలిపారు. అసైన్డ్ రైతులు, కబ్జాలో ఉన్న వారందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.సమావేశంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్క్రీన్ టైమ్‌కు చెక్.. పుస్తకాలతో చెలిమి

## : 'చిల్డ్రన్స్ వరల్డ్' ద్వారా యువ రచయితల ప్రయాణం



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** శరవేగంగా సాంకేతిక మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత కాలంలో, పిల్లలలో సృజనాత్మకతను మరియు విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించడం భవిష్యత్తు కోసం చేసే అత్యంత కీలకమైన పెట్టుబడి. ఈ దృక్పథాన్ని పునరుద్ఘాటిస్తూ, 'చిల్డ్రన్స్ వరల్డ్' త్రైమాసిక పత్రిక నూతన సంచికను శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధికారికంగా విడుదల చేశారు.ప్రతి మూడు నెలల కోసారి వెలువడే 'చిల్డ్రన్స్ వరల్డ్', బాలల్లోని సహజసిద్ధమైన ప్రతిభను వెలికితీసి, అభినందించి, తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన ఒక వినూత్న విద్యా వేదికగా నిలుస్తోంది. ఈ పత్రిక ప్రధానంగా పిల్లలు రాసిన సాహిత్య రచనలతో పాటు, అనుభవజ్ఞులైన రచయితలు మరియు విద్యావేత్తల విలువైన వ్యాసాలతో కూడిన ప్రత్యేకమైన సంకర (హైబ్రిడ్) రూపాన్ని కలిగి ఉంటుంది.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ.. యువతలో అక్షరాస్యత పెంపునకు పత్రిక అందిస్తున్న నిస్వార్థ సేవలను అభినందించారు. పిల్లలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి ఒక వేదికను కల్పించడం ద్వారా వ్యక్తిగత వికాసానికి మరియు దేశాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. స్క్రీన్ సమయం (డిజిటల్ సాధనాల) పరధ్యానాలు పెరుగుతున్నప్పటికీ, విద్యార్థులలో సాహిత్య పఠనాభిలాషను సజీవంగా ఉంచడానికి మేనేజింగ్ ఎడిటర్ మక్కపాటి చంద్రశేఖరరావు మరియు చీఫ్ ఎడిటర్ పి.ఎన్. భాను ప్రకాష్ వాలంటీర్లుగా చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో నిజాంపేటలోని రాజధాని రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ దీపిక, తెలుగు ఉపాధ్యాయురాలు కవిత, స్కూల్ కోఆర్డినేటర్ కామేశ్వరి, లాల్ గాడి మల్కాజిగిరికి చెందిన హిందీ పండితురాలు పాముల మాధవి, ఇన్వెస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్, షాజహాన్ మరియు జర్నలిస్ట్ సముద్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.చిన్నారి రచయితలు తమ కథలు, కవితలు మరియు ఆలోచనలను ప్రచురించుకోవడానికి తగిన వేదికను అందించడం ద్వారా, 'చిల్డ్రన్స్ వరల్డ్' పత్రిక సాంప్రదాయ ప్రింట్ మీడియాను ఆధునిక విద్యా లక్ష్యాలతో మేళవించి భావి నాయకులను, ఆలోచనాపరులను మరియు రచయితలను ఎలా తీర్చిదిద్దవచ్చో నిరూపిస్తూనే ఉంది.

# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలి

- **ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల**
- **జాతీయస్థాయి సమావేశం – పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే లు**



**ఇల్లందు, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క, ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య,ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇందిరా భవన్ ఆవరణలో భగవాన్ బిర్సా ముండా, మహాత్మా గాంధీ చిత్రపటాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తోంది. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత.భగవాన్ బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం చేసిన పోరాటం, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, సామాజిక సమానత్వ మార్గం మనందరికీ స్ఫూర్తిదాయకం. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులుగా మనమంతా కట్టుబడి పనిచేయాలి.ఎస్సీ, ఎస్టీ ప్రజలకు విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు, భూమి, గృహ వసతి, వైద్యం, మౌలిక సదుపాయాలు అందేలా మరింత సమర్థవంతంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి.దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమై తమ ప్రాంతాల్లోని సమస్యలను చర్చించుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం. ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో బలంగా వినిపిస్తూ, రాజ్యాంగ హక్కులు మరియు సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు సాగాలి అని ఎమ్మెల్యే అన్నారు.ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు.

# అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా అన్నదానం

- **పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజా సేవా కార్యక్రమాలు**
- **కీర్తిశేషులు ఉప్పలపు విజయలక్ష్మి జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ**





**గజ్వేల్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమావాస్య అన్నప్రసాద వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో, లయన్ సంజయ్ గుప్తా కుటుంబ సభ్యుల సౌజన్యంతో కీర్తిశేషులు ఉప్పలపు విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఈ అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, లయన్ గుడాల రాధాకృష్ణ, అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పితృపక్షాల పుణ్య దినాలను పురస్కరించుకుని ప్రతిరోజు దాతల సహకారంతో ఇక్కడ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురాణాల ప్రకారం పితృపక్షం రోజుల్లో అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం వల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని, పితృదేవతల ఆశీస్సులు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఉప్పలపు విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ సేవకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ అన్నదాన కార్యక్రమంలో లయన్ దొంతుల సత్యనారాయణ, కాశీనాథ్, శ్రీహరి, కైలాస ప్రశాంత్, సాంబయ్య, దూబకుంట లక్ష్మణ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టు హిల్ కాలనీ అభివృద్ధికి కదలిక

- **జర్నలిస్టు హిల్ కాలనీ అభివృద్ధికి కదలిక**



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు నివాస స్థలాలు కేటాయించింది. అప్పటి హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మల్కాజిగిరి, అల్వాల్, జవహర్‌నగర్, శామీర్‌పేట్ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులతో పాటు శామీర్‌పేట్‌లోని నిరుపేదలకు కూడా స్థల పట్టాలు అందజేశారు.శామీర్‌పేట్‌లో కేటాయించిన జర్నలిస్టుల స్థలాలు దాదాపు 18 ఏళ్లుగా ఎలాంటి మౌలిక వసతుల అభివృద్ధికి నోచుకోక నిర్మానుష్యంగానే ఉండిపోయాయి. 2019లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అందించిన ఆర్థిక సహకారంతో గుట్టలు, బండరాళ్లతో ఉన్న ప్రాంతాన్ని చదును చేసి నివాసయోగ్యంగా మార్చుకునేందుకు జర్నలిస్టులు స్వయంగా కృషి చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టు హిల్ కాలనీకి మౌలిక వసతులు కల్పించేందుకు కదలిక మొదలైంది. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీ సభ్యులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గతంలో అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, శామీర్‌పేట్ ప్రాంతాలకు చెందిన సీనియర్ జర్నలిస్టులు మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించగా, రెండు రోజుల క్రితం మరోసారి కాలనీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు.వినతులకు స్పందించిన అధికారులు బుధవారం జర్నలిస్టు హిల్ కాలనీని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డీఈ మాధవాచారి, ఏఈ నిరీషా కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. కాలనీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడంతో త్వరలోనే మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావం కాలనీ సభ్యుల్లో వ్యక్తమవుతోంది.

# ఘనంగా ప్రోఆర్క్ 20వ వార్షికోత్సవ వేడుకలు




**శంషాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మైక్రోసాఫ్ట్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ద్వారా ఆధునీకరణ, భద్రత, వ్యాపార వృద్ధికి సేవలందిస్తున్న ప్రముఖ సాంకేతిక సంస్థ ప్రోఆర్క్ తన 20వ వార్షికోత్సవ వేడుకలను శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లోని సెరీన్ రిసార్ట్స్ అండ్ కన్వెన్షన్స్‌లో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రోఆర్క్ సీఈవో సంతోష్ కావేటి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల క్రితం ఒక బలమైన నమ్మకంతో ప్రోఆర్క్ ప్రయాణం ప్రారంభమైందన్నారు. సరైన వ్యక్తులు ఒక లక్ష్యంతో కలిసి పనిచేస్తే సాంకేతికత అందించే అవకాశాలను వ్యాపార ఫలితాలుగా మార్చవచ్చనే విశ్వాసంతో సంస్థ ముందుకు సాగిందని తెలిపారు. క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ నుంచి ప్రస్తుతం ఏఐ వరకు చోటుచేసుకున్న ప్రతి సాంకేతిక పరిణామంలోనూ ఇదే నమ్మకం సంస్థను ముందుకు నడిపించిందన్నారు. ప్రోఆర్క్ 20 ఏళ్ల ప్రస్థానంలో ఉద్యోగుల నిబద్ధత, క్లయింట్ల విశ్వాసం, మైక్రోసాఫ్ట్ వంటి భాగస్వామ్య సంస్థల సహకారం కీలకమని సంతోష్ కావేటి పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఐను ప్రయోగ దశ నుంచి వాస్తవ వినియోగంలోకి తీసుకువస్తున్న సమయంలో బలమైన పునాదులు నిర్మించడం, వ్యాపారాలను సురక్షితంగా ఉంచడం, దీర్ఘకాలిక ఫలితాలను అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రోఆర్క్ ప్రయాణంలో మరింత ఉత్తేజకరమైన అధ్యాయం ముందుందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రోఆర్క్ ఉద్యోగులు పాల్గొన్న ఈ వేడుకల్లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతపై కీనోట్ సెషన్ నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగం ప్రతినిధులు సందీప్ శ్రీవాస్తవ, ప్రేరణ నాయక్ స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. ఏఐ రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ–వ్యాపార రంగాల భవిష్యత్తుపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన 'ప్రోఆర్క్ డిస్కవరీ ఎక్స్‌పీరియన్స్' ఇంటరాక్టివ్ బిజినెస్ షోకేస్ ఉద్యోగులను ఆకట్టుకుంది. సంస్థ అందిస్తున్న వివిధ సేవలు, క్లయింట్ విజయగాథలు, సాంకేతిక ఆవిష్కరణలను ఉద్యోగులు తెలుసుకునే అవకాశం లభించింది. వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. సాయంత్రం నిర్వహించిన గాలా వేడుకల్లో ప్రోఆర్క్ రెండు దశాబ్దాల ప్రస్థానం, విజయాలను గుర్తుచేసుకున్నారు. నాయకత్వ ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డులు, రివార్డులు, ఉద్యోగుల వినోద కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. ఉద్యోగుల్లో ఐక్యత, ఉత్సాహం వెల్లివిరిసింది. ప్రోఆర్క్ సామాజిక బాధ్యత విభాగమైన యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, శ్రేయస్సు, సమాజ హితం లక్ష్యంగా నిర్వహించిన 5కే రన్‌తో వేడుకలు ముగిశాయి. ఉద్యోగులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొని ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యతను చాటిచెప్పారు.

నేటి శుభోదయ
తెలుగు దినపత్రిక
గురువారం | హైదరాబాద్
01 - 10 - 2026
www.netisubhodaya.com



## ఆర్‌జీఐఏలో రూ.24.5 కోట్ల కొకైన్ పట్టివేత




**శంషాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా కొకైన్ పట్టుబడింది. దోహా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ భారతీయ ప్రయాణికుడి వద్ద నుంచి సుమారు రూ.24.5 కోట్ల విలువైన 4.9 కిలోల కొకైన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. డీఆర్ఐ అధికారులకు ముందుగా అందిన సమాచారం ఆధారంగా దోహా నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలపై నిఘా పెట్టారు. విమానాశ్రయంలో అతని క్యాబిన్ బ్యాగేజీని తనిఖీ చేయగా, ఏడు చాక్లెట్ ట్యూబ్‌లు అధికారులకు అనుమానం కలిగించాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించగా చాక్లెట్ల మధ్యలో ప్రత్యేకంగా దాచిన 207 అండాకారపు క్యాప్సూల్స్ బయటపడ్డాయి. క్యాప్సూల్స్‌లోని తెల్లటి పొడి పదార్థాన్ని నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా అది కొకైన్‌గా నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 4.9 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ అక్రమ మార్కెట్ ప్రకారం సుమారు రూ.24.5 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం–1985 కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు. ఈ కొకైన్ ఎక్కడి నుంచి సమకూరింది? హైదరాబాద్‌లో ఎవరికి అందజేయాల్సి ఉంది? ఈ అక్రమ రవాణా వెనుక అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠా ప్రమేయం ఉందా? అనే అంశాలపై డీఆర్ఐ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరిన అమర జవాన్ కిషన్ కుమార్ మృతదేహం



**శంషాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ జరిగిన ప్రమాదంలో ఆర్మీ జవాన్ కిషన్ కుమార్ మృతి చెందారు. ఆయన భౌతికకాయం బుధవారం శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న కిషన్ కుమార్ తవాంగ్ ప్రాంతంలో జరిగిన ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. అనంతరం ఆయన మృతదేహాన్ని ఇండిగో కార్గో విమానం ద్వారా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు తరలించారు. ఎయిర్‌పోర్ట్‌లో ఆర్మీ అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులు, బంధువులు అమర జవాన్ భౌతికకాయాన్ని స్వీకరించారు. తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయిన విషాదంలో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో విమానాశ్రయంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అనంతరం కిషన్ కుమార్ మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఆయన స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా పందిలపల్లి గ్రామానికి తరలించారు. అక్కడ ఆర్మీ అధికారులు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల సమక్షంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి టౌన్ ప్లానింగ్ అధికారులు.. ఇరుపక్షాలకు నోటీసులు



**శంషాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** శంషాబాద్ పరిధిలోని పలు సర్వే నంబర్లలో ఉన్న 19.27 ఎకరాల భూములకు సంబంధించిన నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారా? అనే అంశాలపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై జి. భాస్కర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, ఆయన దాఖలు చేసిన డబ్ల్యూ.పి. నెంబర్.25805/2026 పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. సంబంధిత అధికారుల ద్వారా ఇరుపక్షాల వాదనలు, రికార్డులను పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. దీంతో హైకోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ సర్కిల్–18 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే నంబర్లు 48, 49, 60, 61, 63, 84, 85, 86, 87, 88, 89 పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులు, నిర్మాణ అనుమతులపై అధికారులు దృష్టి సారించారు. ఇరుపక్షాలు తమ వాదనలకు మద్దతుగా ఉన్న పత్రాలు, భూ రికార్డులు, నిర్మాణ అనుమతులు, ఇతర ఆధారాలను సమర్పించాలని అధికారులు నోటీసుల ద్వారా సూచించారు. పిటిషనర్ జి. భాస్కర్ రెడ్డి, మరోవైపు ఎం/ఎస్ ఆశ్రిత ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి మెల్లంపూటి మధు విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ట్యాంక్ బండ్ రోడ్డులోని జీహెచ్ఎంసీ కమిషనర్ ఛాంబర్‌లో సంబంధిత రికార్డులతో హాజరై తమ వాదనలు వినిపించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇరుపక్షాలు సమర్పించే ఆధారాలను పరిశీలించిన అనంతరం నిర్మాణ అనుమతులు, భూముల సంబంధిత అంశాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే నోటీసులు జారీ చేయడం తుది నిర్ణయం కాదని, ప్రస్తుతం ఇది హైకోర్టు ఆదేశాల మేరకు కొనసాగుతున్న విచారణ ప్రక్రియ మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. రికార్డుల పరిశీలన, ఇరుపక్షాల వాదనలు పూర్తయిన తర్వాతే ఈ వ్యవహారంపై తుది నిర్ణయం వెలువడనుంది.

## తాను నాయక్ నగారా ఉత్సవాలను జయప్రదం చేయండి

- గిరిజన సంఘం నేతలు, ప్రజాప్రతినిధుల పిలుపు.



**ఏన్కూర్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే తాను నాయక్ నగారా ఉత్సవాలను గిరిజన ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం, ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ పిలుపునిచ్చారు.బుధవారం ఏన్కూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు, తాను నాయక్ నగారా ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు.ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ...గిరిజన లంబాడీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడంతో పాటు, రాజ్యాంగం కల్పించిన గిరిజన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన తాను నాయక్ స్ఫూర్తితో భవిష్యత్తులో గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.అక్టోబర్ 10న నిర్వహించే తాను నాయక్ నగారా ఉత్సవాల్లో గిరిజన సమాజం పెద్ద సంఖ్యలో పాల్గొని, లంబాడీ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు అజ్మీరా సురేష్, లాకావత్ సరోజ, బానోతు లక్ష్మా నాయక్, గుగులోత్ ప్రవీణ్, తేజావత్ లలిత, ధరావత్ బాబు, భూక్యా నర్సి లాలు, ధరావత్ సోనీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవాలయ అర్చక శిక్షణ తరగతులు.

- గ్రామ దేవాలయ అర్చకులకు శిక్షణ.
- గ్రామ దేవాలయ అర్చకులకు శిక్షణ.



**ఏన్కూర్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** గ్రామ దేవాలయాల్లో అర్చకుల కొరతను అధిగమించడంతో పాటు దేవాలయాల్లో నిత్య పూజలు, అర్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించేలా అర్చకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ధర్మజాగరణ విభాగం నిర్వాహకులు తెలిపారు. గ్రామ దేవాలయాల్లో అర్చకులు లేని కారణంగా పూజా కార్యక్రమాలు సక్రమంగా జరగని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శిక్షణ తరగతులను నాచారం అద్భుత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గల సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగ డాక్టర్ నాన్న ఆశ్రమం నందు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.శిక్షణకు 5వ తరగతి లేదా అంతకంటే పై చదువు చదివి ఉండాలి. పూజా విధానంలో మంత్రాలు చదవగలగాలి. వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. శిక్షణలో భాగంగా యోగా కూడా ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలం మొత్తం ఏడు రోజులు ఉండగా, మధ్యలో వెళ్లేందుకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సంబంధిత ధ్రువపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.అర్చకులకు ప్రత్యేక శిక్షణఏడు రోజుల శిక్షణలో నిత్య పూజా విధానాలు, గ్రామ దేవాలయాల్లో నిర్వహించాల్సిన పూజా కార్యక్రమాలు, పూజా సామగ్రి వినియోగం, నైవేద్యం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. దేవాలయాల్లో అర్చకులుగా సేవలందించేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలను వివరించనున్నారు.

## వెల్జాల్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

- మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ వానరాసి రాములమ్మ



**తలకొండపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.మాజీ ఎంపీపీ సేల్స్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ వానరాసి రాములమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ ఎల్.బి.నగర్‌లోని కామినేని ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గ్రామస్థులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు ఉచితంగా చేశారు.అనంతరం బాధితులకు జ్వరం, జలుబు, ఒంటి నొప్పులు, బలానికి సంబంధించిన ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం: మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సి ఎల్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుపేదలు, కార్మికులు ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పొందలేక అనారోగ్యం బారిన పడుతున్నారని, అలాంటి వారికి అండగా నిలిచేందుకే కామినేని ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. యువ నాయకుడు వాన రాసి వెంకటేష్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి , విజయ్ కుమార్, ముజిబూర్ రెహమాన్, కార్యదర్శి వాజీద్, వార్డ్ సభ్యులు శేఖర్, నరేందర్ గౌడ్, రాజేందర్ రెడ్డి, గన్నోజు రవి, శ్రీశైలం, సువర్ణ, యాదమ్మ, కామినేని ఆసుపత్రి ప్రతినిధులు సందీప్, డాక్టర్ సంధ్య, విలేకరి విష్ణువర్ధన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కవితను కలిసిన జాగృతి రాష్ట్ర కార్యదర్శి స్వర్ణలత....





**నిజామాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన నిజామాబాద్ నగరానికి చెందిన దొండి స్వర్ణలత తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు,తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితను హైదరాబాదులోని జాగృతి కార్యాలయంలో కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా ప్రకటించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం స్వర్ణలత మాట్లాడుతూ....తెలంగాణ జాగృతి,తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే ఒక స్వచ్ఛంద సేవా సంస్థ అని ఆమె తెలిపారు.బతుకమ్మ పండుగను,తెలంగాణ విశిష్టతను మరుగున పడకుండా ప్రపంచానికి చాటి చెప్పాలనే సంకల్పంతో కల్వకుంట్ల కవిత జాగృతిని స్థాపించడం జరిగిందన్నారు. ఆమె ఆధ్వర్యంలో బతుకమ్మను దేశ నలుమూలల విస్తరింపజేసి,ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు."బతుకమ్మ పండుగ"ను గిన్నిస్ రికార్డు సృష్టించాలనే సంకల్పంతో కల్వకుంట్ల కవిత కృషి చేస్తున్నారని,ఆమె ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగతో గిన్నిస్ రికార్డు సృష్టిస్తామని స్పష్టం చేశారు.అనంతరం స్వర్ణలతను కల్వకుంట్ల కవిత శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు సమ్మిళిత విద్యపై అవగాహన

**శంషాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమ్మిళిత విద్యపై అవగాహన సదస్సును బుధవారం శంషాబాద్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ప్రత్యేక అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, సౌకర్యాలు, ఉపకార వేతనాలు, సహాయ పరికరాలపై తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులు సమాజంలో ఇతరులతో సమానంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బోధనా పద్ధతులను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ధైర్యంగా పాఠశాలలకు పంపించి, విద్యాభ్యాసంలో ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులు రోజువారీ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించుకోవడంతో పాటు, వారికి అవసరమైన శిక్షణ అందించేందుకు 'దివ్యాంగ సారథి' పేరుతో రూపొందించిన వెబ్సైట్ ద్వారా ప్రత్యేక నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నమోదు విధానం, అందుబాటులో ఉన్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం





సమన్వయ అధికారి పి. రమేష్, సాజిత ఇవాంజుల్, దివ్యాంగ సారథి ప్రాజెక్టు నిర్వాహకులు, జిల్లా సమాజ సమీకరణ అధికారి, సమన్వయకర్త బత్తిని వెంకటేష్, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, బాలుర, బాలికల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, సువర్ణతో, ఉపాధ్యాయులు, ప్రత్యేక విద్యా బోధకులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సూర్య–సేతు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి: పినపాక ఏఈ వేణుగోపాల్



**పినపాక, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** గృహ విద్యుత్ వినియోగదారులకు సౌర విద్యుత్ వినియోగం, ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణ సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు "సూర్య–సేతు" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుపినపాక ఏఈ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన పినపాక మండలం ఈ బయ్యారంలో గల సబ్ స్టేషన్ వద్ద మాట్లాడారు. పీఎం సూర్య ఘర్–ముఫ్త్ బిజ్లీ యోజన కింద అర్హులైన వినియోగదారులకు 1 కిలోవాట్‌కు రూ.30 వేల వరకు, 2 కిలోవాట్లకు రూ.60 వేల వరకు, 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్టంగా రూ.78 వేల వరకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ అందుతుందని వివరించారు.భద్రాచలం డివిజన్ కార్యాలయంలో అక్టోబర్ 1, 2 తేదీల్లో, మణుగూరు సబ్‌స్టేషన్ ప్రాంగణంలో అక్టోబర్ 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సూర్య–సేతు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సోలార్ వెండర్లు, బ్యాంకు లీడ్ మేనేజర్లు పాల్గొని సౌర విద్యుత్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలు, సబ్సిడీ, రుణ సౌకర్యాలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. అర్హులైన వినియోగదారులకు అక్కడికక్కడే స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. గృహ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పినపాక ఏఈ వేణుగోపాల్ కోరారు.

## కుల వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : ఆర్ఐ కంది సత్యనారాయణ, ఏఎస్ఐ సుభాష్

- జంగం రెడ్డిపల్లిలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం
- చట్టం ముందు అందరూ సమానమే.
- వివక్ష చూపే వారిపై చర్యలు తీసుకోవాలి: టీజేయూ జిల్లా అధ్యక్షుడు మరాఠీ కృష్ణమూర్తి






**జగదేవపూర్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** గ్రామాల్లో కుల వివక్షకు తావులేకుండా చూడాలని, ఎవరైనా వివక్షకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) కంది సత్యనారాయణ, ఏఎస్ఐ సుభాష్ హెచ్చరించారు. బుధవారం జగదేవపూర్ మండలంలోని జంగం రెడ్డిపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ఐ కంది సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజిత అశోక్, ఏఎస్ఐ సుభాష్, జీపీఓ బాల్ లింగం, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మరాఠీ కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ సుభాష్ మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించిందని, చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. గ్రామాల్లోని దేవాలయాలు, పాఠశాలలు, హోటళ్లు తదితర బహిరంగ ప్రాంతాల్లో ఎలాంటి కుల వివక్షకు పాల్పడరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి వివక్ష చూపించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. అనంతరం టీజేయూ జిల్లా అధ్యక్షుడు మరాఠీ కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉమ్మడి జగదేవపూర్ మండల పరిధిలో గతంలో కుల వివక్షకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో శివారు వెంకటాపూర్, జంగం రెడ్డిపల్లి, మర్కూక్ మండలంలోని శివ వెంకటాపూర్ గ్రామాల్లో జరిగిన కుల వివక్ష ఘటనలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్షకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులకు మరింత ప్రయోజనం

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- అనువైన స్థలం కోసం లక్కంపల్లి సెజ్ భూముల పరిశీలన
- రైస్ బ్రాన్ ఆయిల్,సోయా పరిశ్రమల ఏర్పాటుకు సైతం కృషి చేస్తామని వెల్లడి





**నిజామాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానిక రైతాంగానికి మరింత ప్రయోజనాలు చేకూరుతాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు.నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి,కలెక్టర్ భవేష్ మిశ్రా,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా,అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ కు ఆనుకుని ఉన్న స్థలాలను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు.సెజ్ ప్రాంతంలో ఫ్యాక్టరీ కోసం గుర్తించిన స్థలం అనుకూలతపై అధికారులతో చర్చించారు.భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండడం,పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాకు 50 కిలోమీటర్ల లోపే చేరువగా ఉండడం,రెండు జిల్లాలలో ఇప్పటికే 17వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగులో ఉండడం,మరో ఐదు వేల ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉండడం వంటి అంశాలు స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుకూలంగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు.సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు.స్థల నిర్ధారణ జరిగిన వెంటనే ఆయిల్ పామ్ ఫాక్టరీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంసిద్ధత తెలిపారని అన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు కూడా ఆయిల్ పామ్ సాగుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఎంతో లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటును అందిస్తోందని,ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు.దేశ వ్యాప్తంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా,ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణంలోపే ఈ పంట సాగు చేస్తున్నారని అన్నారు.దీనివల్ల ఇతర దేశాల నుండి వంట నూనె నిల్వలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవాల్సి రావడం భారంగా పరిణమించిందని,స్థానికంగానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే,రైతులు అధిక లాభాలు ఆర్జించడంతో పాటు ప్రజలకు కూడా మేలు చేసిన వారవుతారని అన్నారు.జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటుతో రైతులకు గణనీయమైన లాభాలు సమకూరడమే కాకుండా,ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.లక్కంపల్లి సెజ్ ప్రాంతంలోని రైస్ బ్రాన్ ఆయిల్,సోయా పరిశ్రమలను కూడా నెలకొల్పేందుకు స్థలాలు అందుబాటులో ఉన్నందున వీటి ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని అన్నారు.అంతేకాకుండా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సేంద్రీయ విధానం ద్వారా చేపడుతున్న కూరగాయల సాగు పద్ధతులను అధ్యయనం చేసి,ఇక్కడ కూడా అదే తరహాలో కూరగాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తామని అన్నారు.ఇదిలాఉండగా,ఎల్ నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియనందున రైతులు నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించాలని,చుక్క నీరు కూడా వృధా కాకుండా చూసుకోవాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి హితవు పలికారు.నీటి లభ్యత అంతగా లేనందున యాసంగిలో వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు.స్థల పరిశీలన జరిపిన వారిలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్,నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో వెల్జాల్‌లో ఘనంగా నూతన గృహ భూమి పూజ

- మాజీ ఎంపీపీసీఎల్ శ్రీనివాస్ యాదవ్, వానరాశి వెంకటేష్



**తలకొండపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో నూతన గృహ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహకారంతో స్థానిక లబ్ధిదారులు పుల్జాల కృష్ణవేణి – కృష్ణయ్య దంపతుల నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్,సర్పంచ్ తనయుడు వానరాసి వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహ నిర్మాణం ఎలాంటి అడ్డంకులు లేకుండా,త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.బాధితులకు ఇల్లు త్వరగా నిర్మించుకునేలా అందరం కలిసికట్టుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు శివ విజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ముజిబూర్ రెహమాన్, విష్ణువర్ధన్ యాదవ్, వార్డు సభ్యులు శేఖర్ యాదవ్, దూల్ల శ్రీశైలం, పుల్జాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పురంలో ఘనంగా అనిష్ ప్రథమ జన్మదిన వేడుకలు: ఆశీర్వదించిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి.



**గుర్రంపోడు, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** గుర్రంపోడు మండల పరిధిలోని సుల్తాన్‌పురం గ్రామ సర్పంచ్ వాడపల్లి శివ – అశ్విని దంపతుల కుమారుడు చిరంజీవి అనిష్ ప్రథమ జన్మదిన వేడుకలు సుల్తాన్ పురం గ్రామంలో బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి.ఈ శుభకార్యానికి నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.సుల్తాన్‌పురంలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి దీవించారు.చిన్నారి ఆయురారోగ్యాలతో, ఉన్నతమైన భవిష్యత్తుతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి,ఉపాధ్యక్షులు గాలి రవికుమార్,మండల అధ్యక్షులు బొమ్ము శ్రీనివాస్, నాయకులు చేనమల జగదీశ్వర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్ రెడ్డి,తగుళ్ల సర్వయ్య,జాల చిన్న సత్తయ్య,మేడి వెంకన్న, కుప్ప అమరేందర్,సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు గంగలి కృష్ణ పాల్గొన్నారు.వీరితో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తలు,కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకుల రాకతో వాడపల్లి కుటుంబ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

- జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి




**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మంథని షెడ్యూలు తెగల బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ను బుధవారం నిర్వహించారు. ఇంటర్నెట్ యుగంలో లో సోషల్ మీడియా వాడకం,దుర్వినియోగం పై చట్టపరమైన అంశాలు వివరించారు. ఈ సమావేశం లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె. రఘోతం రెడ్డి, ప్రిన్సిపల్ బి వసుందర, న్యాయవాది శశీభూషన్ కాచే తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మంథని గోదావరి పుష్కరాలు–2027 నేపథ్యంలో మంథని సెక్షన్ పరిధిలోని గోదావరి నది పుష్కర ఘాట్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పుష్కర ఘాట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి విద్యుత్ సరఫరా పరిస్థితి, అవసరమైన మౌలిక వసతులపై అధికారులతో సీఎండీ సమీక్షించారు. పుష్కరాల సమయంలో భక్తులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే దుబ్బపల్లి ఇటీవల ఛార్జ్ చేసిన ఎస్‌హెచ్‌జీ సోలార్ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో సీఎండీ పరిశీలించారు.ఈ సందర్భంగా సోలార్ ప్లాంట్ పనితీరు, విద్యుత్ ఉత్పత్తి, గ్రిడ్‌కు అనుసంధానం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని మరింత పెంచే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.సోలార్ ప్లాంట్ నిర్వహణలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ప్లాంట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సీఎండీ సూచించారు.ఈ పరిశీలనలో ఎస్ఈ ఆపరేషన్స్ పెద్దపల్లి వడ్లకొండ గంగాధర్, డీఈ ఆపరేషన్స్ మంథని, ఏఈడీ ఆపరేషన్స్ మంథని, ఏఈ,ఆపరేషన్స్ మంథని , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ROBల నిర్మాణానికి రూ.14.77 కోట్ల నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ప్రజాప్రయాణానికి భరోసా..అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబాటు
- సుదర్శన్ రెడ్డి,మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యే భూపతి రెడ్డి కృషికి ఫలితం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు



**నిజామాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా ప్రజలు,వాహనదారులు ఎదుర్కొంటున్న రైల్వే క్రాసింగ్ ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.నిజామాబాద్ జిల్లాలోని మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ROB)ల నిర్మాణంతో పాటు వాటికి అనుసంధానంగా నాలుగు వరుసల రహదారుల నిర్మాణానికి రూ.14.77 కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది.రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు,మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి,టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి చేసిన నిరంతర కృషి,ప్రభుత్వంతో జరిపిన సమన్వయ ప్రయత్నాల ఫలితంగానే ఈ నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.మంజూరైన నిధుల వివరాలు:

- ◆ అర్సపల్లి రైల్వే ROB నిర్మాణానికి రూ.8,48,65,952.
- ◆ మన్మాడ్–సికింద్రాబాద్ రైల్వే లైన్,నిజామాబాద్ బైపాస్ రోడ్డు వద్ద ROB నిర్మాణానికి రూ.4,04,53,437.
- ◆ హైదరాబాద్–నిజామాబాద్ ప్రధాన రహదారిపై డిచ్‌పల్లి శివారు మాధవ్‌నగర్ వద్ద ROB నిర్మాణానికి రూ.2,24,67,543.

ఈ నిధులతో ROBల నిర్మాణంతో పాటు వాటికి అనుసంధానంగా నాలుగు వరుసల రహదారుల అభివృద్ధికి మార్గం సుగమం కానుంది.ఈ నిర్మాణాలు పూర్తయితే రైల్వే గేట్ల వద్ద వాహనాల నిరీక్షణ తగ్గడంతో పాటు జిల్లా ప్రజలు,ప్రయాణికులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.అత్యవసర సేవలు,నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులకు కూడా గణనీయమైన ప్రయోజనం చేకూరనుంది.జిల్లా అభివృద్ధికి దోహదపడే ఈ నిర్ణయంపై ప్రజలు,ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి,కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు మానుకోవాలి: ఎమ్మెల్యే భూపతి రెడ్డిఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ....రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అవసరాలను గుర్తించి,మౌలిక సదుపాయాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు.జిల్లాలో కీలకమైన ROBల నిర్మాణానికి నిధులు విడుదల కావడం ప్రజల చిరకాల అవసరాన్ని నెరవేర్చే దిశగా ముందడుగు అని పేర్కొన్నారు.అభివృద్ధి పనులకు సహకరించాల్సిన ప్రతిపక్ష బీజేపీ,బీఆర్ఎస్ నాయకులు అనవసర రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో ప్రజా అవసరాల కోసం నిధులు విడుదల చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తుంటే,కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధుల విషయంలో ఇక్కడి బీజేపీ ప్రజాప్రతినిధులు తమ బాధ్యతను నిర్వర్తించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.నిజామాబాద్ జిల్లాకు రావాల్సిన కేంద్ర నిధులను సాధించడంలో చిత్తశుద్ధి ఉంటే,బీజేపీ ప్రజాప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు విడుదల చేయించాలని సవాల్ విసిరారు.రాజకీయ విమర్శల కంటే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేసిన ఎమ్మెల్యే,నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## దైవ సన్నిధిలో దివ్యమైన సేవలు అందిస్తాము

- ఆలయ చైర్మన్ తిరుమలేష్




**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** శ్రీ లక్ష్మి నారాయణ దైవ సన్నిధిలో దివ్య మైన సేవలు అందిస్తామని ఇటీవల ఈ ఆలయ కమిటీకి నూతనంగా నియమితులైన అధ్యక్షులు వంగల తిరుమలేష్ మంథని విద్యార్థి యువత కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అన్నారు.హిందూధర్మ శ్రేష్ఠ వర్ధని, మంథని విద్యార్థి యువత సంయుక్త సమాధ్వర్యములోతిరుమలేష్ ను ఘనంగా సత్కరించారు.కార్యక్రమ అధ్యక్షులు కొండేల మారుతి ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక శక్తి సంపద మేళవించిన మంత్రపురి భక్తి చరిత్రలో శ్రీ లక్ష్మి నారాయణ దేవాలయం ధార్మిక స్రవంతి నిరంతరం ప్రజ్వలుతుందన్నారు.మంథని గడ్డ కున్న పవిత్ర ప్రశస్త్యం కొనసాగేలా రానున్న పుష్కరాలను ప్రజల అండదండలతో సేవా పంథాగా తగు భూమిక పోషిస్తామన్నారు.ఆదరణీయంగా సత్కారం జరిగిన ప్రక్రియ ను స్వర్ణకారుల మిత్ర బృంద ప్రతినిధులు నిర్వహించారు.

## స్వచ్ఛతా హి సేవా 2026 – కార్యాచరణ నివేదిక







**నిజామాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** స్వచ్ఛతా హి సేవ 2026 కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

★ సఫాయి కర్మచారిలు,వ్యర్థాలను పికర్స్ కోసం PPE కిట్లు,ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయబడ్డాయి.

★ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణ,పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

★ పరిశుభ్రత,పారిశుధ్యం గురించి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు "స్వచ్ఛత" అనే అంశంపై డ్రాయింగ్ పోటీ నిర్వహించారు.కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి,మున్సిపల్ డీసీ,మున్సిపల్ కార్పొరేషన్‌లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు,జవాన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.పరిశుభ్రత,పారిశుధ్యం,ఆరోగ్యంపై అవగాహన,ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# తలకొండపల్లిలో నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

- సన్న రకాలకు క్వింటాకు రూ. 500 బోనస్
- గ్రేడ్ 'ఎ' ధాన్యానికి రూ. 2461 మద్దతు ధర
- మధ్యాహ్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ
- తలకొండపల్లి మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి



**తలకొండపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తలకొండపల్లి,మండల కేంద్రంలోని పిఎసిఎస్ సెంటర్ వద్ద వానాకాలం (ఖరీఫ్) 2026–27 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రేపు (గురువారం) స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు సంబంధిత ప్రభుత్వ అధికారులు ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. రైతులు తాము పండించిన వరి పంటకు ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధరను పొందాలంటే.. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.మద్దతు ధర మరియు బోనస్ వివరాలు:ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను ప్రభుత్వం గ్రేడ్ 'ఎ' రకం ధాన్యానికి క్వింటాకు రూ. 2,461, సాధారణ రకానికి రూ. 2,441 మద్దతు ధరగా నిర్ణయించింది. దీనికి అదనంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విధంగా 7 రకాల సన్న బియ్యం రకాలకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించనున్నారు.బోనస్ వర్తించే సన్న రకాలు: BPT 5204, RNR 15048, HMT సోనా, జై శ్రీరామ్ సెగ్మెంట్, KNM 1638, WGL 44, KNM 7715.నాణ్యతా ప్రమాణాలు ఇవే..రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, చెత్తాచెదారం, మట్టిపెడ్డలు లేకుండా శుభ్రం చేయాలి.తేమ శాతం: గరిష్టంగా 17.00% మాత్రమే ఉండాలి.

★ చెత్త, తాలు: 1.00% లోపు
★ మట్టి పెడ్డలు, రాళ్లు: 1.00% లోపు
★ పూర్తిగా తయారుకాని, ముడుచుకుపోయిన ధాన్యం: 3.00% లోపు
★ తక్కువ రకముల మిశ్రమం: 6.00% లోపు
★ చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం: 5.00% (అయితే మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 4% మించరాదు).

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే జిల్లా కంట్రోల్ రూమ్‌ను గానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్లు 1967, 1800 425 00 333 లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.అనంతరందేవకీ గార్డెన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల 'ఫ్రెషర్స్ పార్టీ' స్థానిక దేవకీ గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి మండల ముఖ్య నాయకులు, బ్లాక్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు,సర్పంచులు,ఉపసర్పంచులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# డిజిటల్ లావాదేవీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. ఉదయశ్రీ



**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ చెల్లింపుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. ఉదయశ్రీ సూచించారు. బుధవారం మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ కె.ఉదయశ్రీ మాట్లాడుతూ లోన్ యాప్‌లు, లాటరీలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, పాన్ కార్డు అప్‌డేట్, ఆధార్ కార్డు లింకేజీ పేరుతో వచ్చే అనుమానాస్పద మెసేజ్‌లు, లింక్‌లను నమ్మవద్దని సూచించారు. ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దన్నారు.గూగుల్‌లో లోన్ యాప్‌ల కోసం వెతకడం చేయవద్దని, సైబర్ నేరగాళ్లు ఆశ, భయం అనే అంశాలను ఆసరాగా చేసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించే సమయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బ్యాంకు ఖాతాదారులు తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కోరారు.రైతుల వ్యవసాయ అవసరాల కోసం పంట రుణాలు అందించేందుకు బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందని, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. పాడి పశువులు, గొర్రెలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తోటలు, పాలీహౌస్‌లు, పవర్ టిల్లర్లు, గోదాములు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, గోల్డ్ లోన్లు, స్వయం సహాయక సంఘాలు, గృహ నిర్మాణం, వ్యాపారాలు, వ్యక్తిగత రుణాలు, విదేశీ విద్య తదితర అవసరాలకు వివిధ రకాల రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.సహకార బ్యాంకు ద్వారా యూపీఐ, ఐఎంపీఎస్, గూగుల్ పే, ఫోన్ పే తదితర డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయని, నగదు రహిత లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనకు రూ.436, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు రూ.20 చెల్లించి బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సహకార బ్యాంకు యందు అత్యధికంగా 8 శాతం వడ్డీ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సహకార బ్యాంకు, సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా రమేష్ టీం బుర్ర కథ ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ కుడుదుల వెంకన్న, సర్పంచ్ తోట పోచయ్య, ఉపసర్పంచ్ కీర్తి సాయి, కేడీసీసీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సందెబోయిన శ్రీనివాస్, ఎఫ్ ఎల్ సి మోహన్ రావు, బ్యాంకు సిబ్బంది మహేశ్వరి, సహకార సంఘం సిబ్బంది నారామల్ల విద్యాసాగర్, పైడాకుల రాకేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో 100 కిలోలకు పైగా గంజాయి పట్టివేత.

**భద్రాచలం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** భద్రాచలంలో కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సుమారు 100 కిలోలకు పైగా గంజాయి ఉన్నట్లు ప్రాథమికంగా తెలిసింది. కారుతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. గంజాయి ఎక్కడి నుంచి తరలిస్తున్నారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు, ఈ వ్యవహారం లో ఎంతమంది ఉన్నారు అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. గంజాయి ఖచ్చితమైన పరిమాణం, నిందితుల వివరాలను అధికారులు అధికారి



కంగా వెల్లడించాల్సి ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- రిటైర్డ్ టీచర్ కృష్ణమూర్తి



**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మంథని పట్టణానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణమూర్తిని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.కృష్ణమూర్తి అనేక సంవత్సరాలుగా తన సొంత ఖర్చులతో మొక్కలు నాటడంతో పాటు రోడ్లపై గుంతలను సిమెంట్‌తో పూడ్చడం, పాఠశాల విద్యార్థులకు మొక్కల ఆవశ్యకత, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సమాజ సేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రకృతి ప్రతి జీవి మనుగడకు ఆధారమని, దానిని నాశనం చేస్తే జీవజాలానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ప్రకృతి పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని, భవిష్యత్‌లో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవాలంటే ప్రజలు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్ అధ్యక్షత వహించారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, సీనియర్ నాయకులు రాపర్తి సంతోష్, నారమల్ల కృష్ణ, బూడిద తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఉపాధ్యక్షుడు బొల్లంపల్లి లక్ష్మణ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గుడ్ల గురువేష్, పట్టణ కోశాధికారి వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 6 ను వెంటనే అమలు చేయాలి

- అమలు కోసం స్పెషల్ స్క్వాడ్ ను నియమించాలి. ~TUCI డిమాండ్.






**నిజామాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన కనీస వేతనాలు జీవో: 6 ను అమలు చేయాలనీ,జీవో నెం: 6 అమలుకై స్పెషల్ స్క్వాడ్ ను నియమించాలనీ డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (TUCI) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి,డీఆర్ఓ గీత కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా టియుసిఐ జాతీయ ఉపాధ్యక్షులు వనమాల కృష్ణ,జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎం.నరేందర్,ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మూడు కేటగిరీలుగా కనీస వేతనాలను ప్రకటించారన్నారు.ఆ వెలుగులో రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1న గెజిట్ విడుదల చేసిందన్నారు.ఈ జీవో ప్రకారం14 వేల నుండి 20వేల వరకు కనీస వేతనాలు ఉండాలన్నారు.ఈ జీవో ద్వారా కోటి మంది కార్మికులు లబ్ధి పొందుతున్నారని ప్రభుత్వం ప్రకటించిందన్నారు.కానీ ఆచరణలో ఇది అమలు కావడం లేదని ఆరోపించారు.కేజీబీవీ,మోడల్ స్కూల్ హాస్టల్స్,మిషన్ భగీరథ,గ్రామపంచాయతీ,మున్సిపల్,ఆశ,అంగన్వాడిల్లో ఇప్పటికీ ఈ జీవో అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.వీరికి 6,500 నుండి 12 వేల వరకు మాత్రమే వేతనాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా వివిధ ప్రైవేటు,కార్పొరేట్ పరిశ్రమలు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ,కార్మికులకు కూడా ఈ జీవో అమలు కావడం లేదన్నారు.వాస్తవానికి పెరుగుతున్న ధరలకు ఇస్తున్న వేతనాలకు పొంతనలేదని,జీవో 6 ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు కూడా సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఈ జీవో ప్రకారం వేతనాలు అమలు చేయాలని,ఈ జీవో అమలు కోసం ప్రత్యేక స్క్వాడ్ ను నియమించాలని డిమాండ్ చేశారు.లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్,సహాయ కార్యదర్శిలు బి.మల్లేష్,డి.కిషన్ కోశాధికారి సాయరెడ్డి జిల్లా నాయకులు మురళి,రాజేశ్వర్,రవి,లింగం,తారాచంద్,సుమలత,రాధా,సుమ,పద్మ,లింగం,గంగాధర్,రాజన్న,ప్రభాకర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు




**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మంథని మండలం భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రద ర్శించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో శ్రీజ రెడ్డి, ఎంఈఓ లక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక తదితర అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఇతర విద్యార్థులతో సమానంగా దివ్యాంగ విద్యార్థులకు కూడా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మరింత ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు.దివ్యాంగ విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఆటల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. సమాజంలో దివ్యాంగుల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.అనంతరం వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు, విలీన విద్యా ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేష్, సౌజన్యతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి.

- **అభివృద్ధి పనుల పై అధికారుల సమీక్ష**





**ఏన్కూర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, మార్కెట్ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.సమావేశంలో ముందుగా ఆయా శాఖల పరిధిలో గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను సమీక్షించారు. అనంతరం మండలంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై చర్చించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సమావేశంలో చర్చించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై కూడా సమీక్షించారు. రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలు, పంటల సాగు పరిస్థితి, ఎరువులు, విత్తనాల లభ్యత, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు.ఇబ్బందులు లేకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు తదితర మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైద్యశాఖ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను సమీక్షించారు. అంగన్వాడి కేంద్రాల పనితీరు పౌష్టికాహారం పంపిణీ చిన్నారుల హాజరు పై చర్చించారు.అనంతరం తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు ,విద్యుత్ సరఫరా పంపిణీ, పశుసంవర్ధక శాఖ సేవలను ,మార్కెట్ కు సంబంధించిన అంశాలు, రెవెన్యూ సమస్యలపై అధికారులు తమ శాఖల పరిధిలో వివరాలను సమావేశానికి తెలియజేశారు. మండలంలో ఏ సమస్యలు ఉన్న సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు .ప్రభుత్వ పథకాలు ,సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రజలకు చేరేలా అధికారులు పరిశీలించాలని మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముజాహిద్దీన్ ఖాన్, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ,మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్ , వివిధ గ్రామ కార్యదర్శులు,వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వనరుల పరిరక్షణ

- **వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి: వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**







**మేడ్చల్–మల్కాజిగిరి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ద్వారా నీటి వనరులను ఆదా చేయడంతో పాటు భూసారాన్ని పరిరక్షించవచ్చని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళా కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డితో కలిసి కోదండరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఉద్యాన పంటలు, మిల్లెట్లు, పండ్లు, కూరగాయల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు.ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలను అందిస్తున్నాయని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయం, జీవ ఎరువులు, జీవ పురుగు మందుల వినియోగంతో పాటు ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడమే కిసాన్ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు.జిల్లాలో అమలవుతున్న వివిధ సబ్సిడీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, ఎరువుల ముందస్తు బుకింగ్ విధానం, రైతు భరోసా, రైతు బీమా, భూసార పరీక్షల ఆధారిత భూసార ఆరోగ్య కార్డులు వంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికత, నూతన వ్యవసాయ విధానాలను అందిపుచ్చుకుని తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖకు సంబంధించిన వివిధ స్టాళ్లను కోదండరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు జాము రవి, శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి ని పరిశీలించిన వినయ్ రెడ్డి....





**నిజామాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి రూ 19 లక్షల నిధులు మంజూరైనట్లు పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సంకీర్త్ వెల్లడించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆస్పత్రిలోని మౌలిక సదుపాయాలు, వైద్య సేవల తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మంజూరైన రూ.19 లక్షల జిల్లా పరిషత్ నిధులతో ఆరోగ్య కేంద్రంలో అత్యంత ముఖ్యమైన మౌలిక వసతులు, కావలసిన మెడికల్ మెటీరియల్ సేకరించనున్నట్లు తెలిపారు. నిధుల కేటాయింపు, ఆస్పత్రికి తక్షణమే కావాల్సిన అవసరాలపై మెడికల్ ఆఫీసర్‌తో ప్రత్యేకంగా చర్చించారు. ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన ప్రధాన అవసరాలు: ప్రత్యేక షెడ్ నిర్మాణం: అత్యవసర కేసులు, రోడ్డు ప్రమాద బాధితులు, పాయిజన్, కేసులకు తక్షణ ప్రథమ చికిత్స అందించడానికి వీలుగా ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేయాలని మెడికల్ ఆఫీసర్ కోరారు. వైద్య పరికరాలు: రక్త పరీక్షలకు సంబంధించిన ఆధునిక పరికరాలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. తాగునీటి సదుపాయం: ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు ఇబ్బంది కలగకుండా స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని వివరించారు. వైద్యులు కోరిన సదుపాయాలన్నింటినీ ఈ నిధుల ద్వారా త్వరలోనే ఏర్పాటు చేసి, ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) వెంకటేశ్వర్లు, పినపాక సర్పంచ్ అలివేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి

- **ఇంటింటి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించి వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి**



**మేడ్చెల్ , సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించి, ఎలాంటి తప్పులకు తావులేకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.బుధవారం కూకట్‌పల్లి మండలంలోని ప్రగతినగర్ ప్రాంతంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి సుదర్శన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటు ధ్రువీకరణ ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాల స్వీకరణ, క్షేత్ర స్థాయిలో అందిస్తున్న సహాయం, రికార్డుల పరిశీలన, ధ్రువీకరణ తదితర అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించాలని, వారితో పాటు సూపర్‌వైజర్లు కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రక్రియను పరిశీలించాలని సూచించారు. ఓటర్ల నుంచి స్వీకరించిన ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న విధానాన్ని సుదర్శన్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు.ధ్రువీకరణకు ఎక్కువగా ఏ పత్రాలను సమర్పిస్తున్నారని బీఎల్ఓలను అడిగి తెలుసుకోగా, ఎస్ఎస్సీ మెమోలు, పాస్‌పోర్టులు ఎక్కువగా సమర్పిస్తున్నట్లు వారు తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను ఆయన ఆదేశించారు.అర్హులైన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదయ్యేలా, ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. హియరింగ్‌ల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షిస్తూ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్, కూకట్‌పల్లి తహసీల్దార్ అశోక్, డిప్యూటీ కమిషనర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపరవైజర్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ వర్ని,జి.అక్షర జెడ్పీహెచ్ఎస్ చల్లగర్గ లు గెలుపొందారు.

# కమీషన్‌లు వస్తేనే పనులు చేయిస్తున్న దుద్దిళ్ల...

- ఏడాది గడిచిన కాటారం మార్కెట్ చేయకపోవడం అవమానం
- 40ఏండ్లు అవకాశం ఇచ్చినా ప్రజలను పట్టించుకోని దుద్దిళ్ల కుటుంబం
- పనులు చేయకుంటేనే మాకు లాభమని చెప్పే ఎమ్మెల్యే ఎక్కడా ఉండడు
- మెజార్టీ ఇచ్చే కాటారం మండల ప్రజలకు ఏం చేసిండ్లో జవాబు చెప్పాలే
- నాలుగు ఆఫీసులు పెట్టి నాలుగు వేల కోట్లు సంపాదించుకున్న దుద్దిళ్ల శ్రీధర్
- ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని కుట్రలు చేసిన ప్రజల పక్షాన పోరాటం చేస్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**మంథని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌కు కమీషన్‌లు ముట్టితేనే అభివృద్ది పనులు చేస్తాడని, లేకుంటే పనులు అర్ధాంతరంగానే ఆగిపోతాయని చెప్పడానికి కాటారం వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణామే నిదర్శనమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం కాటారం కేంద్రంలో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ శిలాఫలకం వేసి శంఖుస్థాపన చేశాడని తెలిపారు. ఏడాది గడిచినా ఈ పనులు పూర్తి చేయకపోవడం అవమానమని ఆయన అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాటారం మండల ప్రజలు దుద్దిళ్ల శ్రీధర్‌కు మెజార్టీ ఇస్తారని, అలాంటి మండల ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. 40ఏండ్లుగా దుద్దిళ్ల కుటుంబానికి ప్రజలు అవకాశం ఇస్తున్నారని, ఎనిమిదిసార్లు అధికారం ఇస్తే పదవులు పొంది వేల కోట్లు సంపాదించుకున్నారే కానీ ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పనులు చేయకపోతేనే మాకు లాభం జరుగుతదని సాక్ష్యాత్తు జిల్లా కలెక్టర్ సాక్షిగా ఆనాడు చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు రివ్యూ మీటింగ్‌లో దుద్దిళ్ల శ్రీధర్ మాట్లాడాడని, ఇలా మాట్లాడే ఎమ్మెల్యే దేశంలో ఎక్కడా ఉండడని ఆయన విమర్శించారు. దుద్దిళ్ల శ్రీధర్‌కు ప్రజలతో ఓటు బంధం తప్ప పేగు బందం లేదనే విషయం అర్ధం అయిందన్నారు. ఈ ప్రాంతంలో 80శాతంకు పైబడి బలహీనవర్గాలు ఉన్నారని, స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వారికి జరుగాల్సిన మేలు జరుగలేదని ప్రజాస్వామ్య పద్దతిలో భారత రాజ్యాంగాన్ని అనుసరించనే ఆవేదన ఆందోళనతో మేము ప్రతి క్షణం అప్రమత్తం చేస్తా ఉన్నామని, మీరు పనిచేస్తే ఈ సమాజం బాగుపడుతదనే ఉద్దేశంతో అప్రమత్తం చేస్తా ఉన్నామని అన్నారు. దుద్దిళ్ల శ్రీధర్‌లాగా చిన్న కాళేశ్వరం పూర్తి చేయకండి అని చెప్పడం లేదని, పని చేయాలని కోరుతున్నామని అన్నారు. ముఖ్యంగా కాటారం మండల ప్రజలు ఓట్లు ఎప్పుడు వస్తే అప్పుడు ఎనిమిది వేలు పదివేల మెజార్టీనిచ్చి అందలమెక్కిస్తే ఈ వెజిటబుల్ మార్కెట్ సంవత్సర కాలమైనా పూర్తి చేయలేకపోయారని, ఇది అవమానం కాదా అని ప్రశ్నించారు. కమిషన్లు ఎక్కడ వస్తే అక్కడ పనులు చేస్తా ఉన్నారని ఆయన ఆరోపించారు.ఈ ప్రాంతంలో జరిగే ఒకటి రెండు పనులు కేవలం కమిషన్ కోసమే జరుగుతానయని ఆయన అన్నారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన కాళేశ్వర ఆలయాన్ని కూల్చివేయవద్దని చెప్పమని, కానీ ఆ పనుల్లో 20శాతం కమీషన్ వచ్చింది కనుకనే పనులు మొదలు పెట్టారని, అదే మార్కెట్‌కు ఎలాంటి కమీషన్ రాకపోవడంతో పనులు పూర్తి చేయడం లేదన్నారు. ఏడాది గడిచినా కాటారం మార్కెట్‌ను పూర్తి చేయని వాళ్లు ఇంత పెద్ద కాళేశ్వరం ఆలయాన్ని ఎలా పూర్తి చేస్తారనే ఆందోళన నెలకొందన్నారు. కాళేశ్వరం ఆలయ అభివృద్ధి కోసం కలెక్టర్ వద్ద వంద కోట్ల రూపాయలు తీసుకచ్చి పెట్టాలని చెప్పినా ఇప్పటి వరకు నిధులు తీసుకురాలేదన్నారు. వచ్చే ఏడాది గోదావరినది పుష్కరాలు ఉన్నాయని, ఈ పుష్కరాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పుష్కర స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారని, ఆ సమయానికి ఆలయ నిర్మాణం పూర్తి కాకపోతే భక్తులకు స్వామివారి దర్శనం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తర్వాత మాసారే అని స్తానిక నాయకులు సంకలు కొట్టుకుంటూ సంబరపడుతున్నారని, ఈ సంతోషం చెవులకు మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఈ ప్రాంత ప్రజల ఆకలి తీర్చాలే భావితరాలు బాగుపడాలనే ఆలోచనతోనే తాము పదేపదే చెప్తున్నామని, తాము ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ మట్టిలో పుట్టి ఈ మట్టిలో పెరిగిన తాము ఈ ప్రాంతం, ఈ ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటామని, ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదన్నారు. మూడు ఓట్లు ఉన్న మీ కుటుంబానికి నలభై సంవత్సరాలుగా అవకాశం ఇస్తున్న ఈ సమాజాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నామని, కాటారం కేంద్రంలోని మార్కెట్ పూర్తి చేయకపోవడంతో కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారులు రోడ్లపై పెట్టి అమ్ముకుంటూ ఇబ్బందులు పడుతున్నారని, ఇటు చిరు వ్యాపారులు అటు ప్రజల ఇబ్బదులను దృష్టిలో పెట్టుకుని మార్కెట్‌ను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంథని ఎమ్మెల్యే ఈ ప్రాంత ప్రజల కష్టాలను పట్టించుకోకుండా తన తమ్ముడితో హైదరాబాద్‌లో నాలుగు ఆఫీసులు పెట్టించి ఇప్పటికే నాలుగు వేల కోట్లు సంపాదించుకున్నాడని, కానీ ఈ నియోజకవర్గ ప్రజల కోసం నాలుగు ఐటీ కంపెనీలు ఒక ఇండస్ట్రీ కోసం ఇప్పటి వరకు కనీసం ప్రతిపాదన చేయలేదన్నారు. ఎంతో మంది పిల్లలు ప్రతి ఏటా ఉన్నత చదువులు చదువుకుని నిరుద్యోగులుగా ఉంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం మూడు సంవత్సరాలైనా ఆలోచించలేదని, వాళ్ళు మాత్రం నాలుగు ఆఫీసులు పెట్టుకొని వేల కోట్లు సంపాదించుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తూ అప్రమత్తం చేస్తామని, ఈ సమాజం అభివృద్ధి కోసం ఆలోచిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపిన సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్






**పినపాక, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** పినపాక మండల నూతన తహసీల్దార్‌గా అప్క రమేష్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రెస్ క్లబ్ తరఫున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంపెల్లి సంతోష్, సభ్యులు తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్ అప్క రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పూలబొకేలు అందజేసి ఘనంగా సత్కరించారు. రెవెన్యూ శాఖ, విలేకరుల వ్యవస్థ కలసికట్టుగా పనిచేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా, రెవెన్యూ శాఖలు నిరంతరం సమన్వయంతో ముందుకు సాగాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆకాంక్షించారు. పారదర్శకమైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యం: తహసీల్దార్ అప్క రమేష్ ప్రెస్ క్లబ్ సభ్యుల అభినందనలకు నూతన తహసీల్దార్ అప్క రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలోని ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రెవెన్యూ సేవలు అందించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితులకు, పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మండలంలో, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ప్రెస్ క్లబ్ విలేకరుల సహకారం ఎంతో కీలకమని, మీడియా అందించే సూచనలు, సలహాలను సానుకూలంగా తీసుకుంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నిట్టా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు నిమ్మ లింగా రెడ్డి, కన్నె రమేష్, కోటేశ్వరరావు, స్థానిక విలేకరులు పాల్గొన్నారు.

# దేవుళ్ల మధ్య నీచ రాజకీయాలు చేయడం

- రేవంత్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనం: BJYM రాష్ట్ర నాయకులు పల్లె తిరుపతి



**మిడ్జిల్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** దేవుళ్ల మధ్య నీచ రాజకీయాలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని BJYM రాష్ట్ర నాయకులు పల్లె తిరుపతి మ ండిప డ్డారు. బుధవారం మిడ్జిల్ మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సమాజాన్ని, హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా మాట్లాడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన సీఎం రేవంత్ రెడ్డి, తన వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే హిందూ దేవుళ్లపై ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తన హామీల గురించి మాట్లాడుకోకుండా, దేవుళ్లపై చేసిన వ్యాఖ్యల గురించే చర్చించుకోవాలని ఇలా చేయడం సిగ్గుచేటన్నారు. హిందూ సమాజ మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన సీఎం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్,బీజేవైఎం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.82 కోట్ల విలువైన 365 కిలోల గంజాయి పట్టివేత.



**భద్రాచలం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** ఒడిశా నుంచి మహారాష్ట్రకు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 365 కిలోల గంజాయిని భద్రాచలం సమీపంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.82 కోట్లు ఉంటుందని ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు.భద్రాచలం వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో డీటీఎఫ్ కొత్తగూడెం బృందం తనిఖీలు చేపట్టగా, తొలుత బైక్‌పై వెళ్తున్న ఒడిశాకు చెందిన దివాకర్ మండల్ (22) వద్ద 9 కిలోల గంజాయి లభించింది. అనంతరం అతడి వెనుక వస్తున్న హ్యుందాయ్ కారును తనిఖీ చేయగా 100 కిలోల గంజాయి పట్టుబడింది. కారులో ఉన్న ఒడిశాకు చెందిన ఎలక్ట్రీషియన్ సుమన్ పాల్ (22)ను అదుపులోకి తీసుకున్నారు.వీరిని విచారించగా మరో లారీలో గంజాయి ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో కరుణగిరి వద్ద నిలిపి ఉంచిన లారీని తనిఖీ చేశారు. లారీలో 263.2 కిలోల గంజాయి లభించింది. లారీలో ఉన్న రాజశేఖర్ మార్గి (22), క్లీనర్ బ్రిజన్ నాసా (20)లను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఒడిశాకు చెందిన వారిగా అధికారులు గుర్తించారు.ఈ ఆపరేషన్‌లో సీఐలు రమాదేవి, కిష్టయ్య, నరేందర్‌రెడ్డి, ఎస్ఐలు సలీముల్లాఖాన్, శ్రీధర్‌రావుతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి పట్టుకున్న బృందాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి అభినందించారు.

# నైట్ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి అదృశ్యం- చెరువులో మృతదేహం లభ్యం



**షాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** షాబాద్ మండలం రేగడిదోస్వాడ గ్రామానికి చెందిన చాకలి రాజయ్య కుమారుడు శ్రీకాంత్ (24) ఈ నెల 24న రాత్రి విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది వెల్స్పన్ కంపెనీలో నైట్ డ్యూటీకి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పిన శ్రీకాంత్ విధులకు హాజరు కాకుండా అదృశ్యమయ్యాడు.షాబాద్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు షాబాద్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం (సెప్టెంబర్ 30) ఉదయం సుమారు 11 గంటల సమయంలో చందన్ వెళ్లి గ్రామ సమీపంలోని చెరువులో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది.సమాచారం అందుకున్న షాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం, ఇతర చట్టపరమైన ప్రక్రియలు పూర్తైన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.శ్రీకాంత్ మృతికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, డిక్షనరీలు పంపిణీ



**మధిర , సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** పట్టణంలో హరిజనవాడ జిల్లా పరిషత్తు పాఠశాల యందు విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీ లు మరియు పెన్నులు వనమా ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేయనైనది ఈ సందర్భంగా వనమా ట్రస్ట్ చైర్మన్ ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు ప్రస్తుత గౌరవ అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు డిక్షనరీలు పరీక్షల సమయంలో ప్యాడ్స్ తదితర వస్తువులు అందజేస్తూ మధిర నియోజకవర్గం లోనే కాక ఖమ్మం నియోజకవర్గం లోని పాఠశాలలో కూడా విద్యార్థులకు పంపిణీ చేయుచున్నామని గత పది సంవత్సరాలుగా నిర్విఘ్నంగా ఈ కార్యక్రమం చేపట్టామని శ్రీ సత్య సాయి భగవాన్దయవల్ల ఈ పంపిణీ కార్యక్రమం చేయుచున్నానని తెలిపారు ఈ కార్యక్రమం లో ట్రస్ట్రామాలయం అధ్యక్షులు వంగవీటి రాజశేఖర్ మధిర పట్టణ ఆర్య వైశ్య సంఘం కోశాధికారి వేములపల్లి శ్రీనివాసరావు ఆర్యవైశ్య సంఘ పెద్దలు వేముల పల్లి ప్రసాద్ రావు జిల్లా రాధాకృష్ణమూర్తి తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# టీజీ సేఫ్ డ్రగ్స్ వింగ్ తొలి డైరెక్టర్ రామ్ధన్‌కు ఫార్మసీ రిటైలర్ల సన్మానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తెలంగాణ ఆహార మరియు నిత్యావసర ఔషధాల ప్రమాణాల ప్రాధికార సంస్థ (టీజీ సేఫ్ – ఔషధ భద్రతా విభాగం) తొలి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ జి. రామ్ధన్‌ను కెమిస్టులు, ఫార్మసీ రిటైలర్ల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫార్మసీ రిటైలర్ల ప్రతినిధులు బోగ శివ కుమార్, విశ్వనాథం, పూర్ణ చందర్, శ్యామ్‌లు పాల్గొని రామ్ధన్‌ను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ... టీజీ సేఫ్ కమిషనర్, పోలీసు అధికారి శ్రీ అవినాష్ మొహంతి పర్యవేక్షణలో, నూతన డైరెక్టర్ రామ్ధన్ నాయకత్వంలో రాష్ట్రంలో ఔషధ భద్రత, నియంత్రణ వ్యవస్థ మరియు ప్రజారోగ్య పరిరక్షణ మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ఆయన ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# వికారాబాద్ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడో?

- ట్రాఫిక్ నుంచి రహదారుల దుస్థితి వరకు.. ప్రజలకు తప్పని ఇబ్బందులు
- విబీజేఆర్ చౌరస్తాలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ
- గంగారం–బూరుగుపల్లి రహదారి పనుల్లో జాప్యం
- కంకర రోడ్డుపై ప్రమాదాలకు అవకాశం
- కాలువలపై రక్షణ లేక వాహనదారులకు ముప్పు
- రాత్రివేళ ఇంధన సదుపాయాల కొరత
- రైల్వే గేట్లతో రాకపోకలకు అంతరాయం
- తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత పరిష్కారం కావాలి









**వికారాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** వికారాబాద్: జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న వికారాబాద్ పట్టణంలో ట్రాఫిక్, రహదారులు, కాలువలు, రైల్వే గేట్ల సమస్యలు ప్రజలను నిత్యం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పట్టణ విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఒకటైన బీజేఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా మారుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రాకపోకలు అధికమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు విగ్రహాన్ని కొంతమేర మార్చినా, సిగ్నల్ వ్యవస్థ, మధ్య విభజన వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని ప్రజలు పేర్కొంటున్నారు.గంగారం–బూరుగుపల్లి రహదారి పనులు కూడా ప్రజలకు పరీక్షగా మారాయి. రహదారిని తవ్వి కంకర పోసి నెల రోజులు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెబుతున్నారు. కంకర రాళ్లపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కంకర కారణంగా ఓ వాహనదారుడు ప్రమాదానికి గురై తలకు గాయమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది.ఇదిలా ఉండగా, బీజేఆర్ చౌరస్తా నుంచి రామయ్యగూడ వెళ్లే మార్గంలో కాలువల సమస్య కూడా వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రహదారి పక్కన ఉన్న కాలువలపై సరైన రక్షణ లేకపోవడంతో వాహనాలు అదుపుతప్పి వాటిలో పడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.రాత్రివేళ ఇంధనం కోసం ఇబ్బందులు కూడా జిల్లా కేంద్రానికి తగని పరిస్థితిగా మారాయని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయంలో పెట్రోలు, డీజిల్ అవసరమైనప్పుడు పట్టణంలోని బంకులు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. సమీపంలోని మన్నెగూడ వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. పట్టణంలో ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు పెరుగుతున్నప్పటికీ వాటికి అవసరమైన సదుపాయాలు అందుబాటులో లేకపోవడం కూడా సమస్యగా మారింది.వికారాబాద్ పట్టణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలంటే ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల అభివృద్ధి, కాలువలపై రక్షణ, రైల్వే గేట్ల సమస్య పరిష్కారం, రాత్రివేళ ఇంధన సదుపాయాలు వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక అవసరమని ప్రజలు కోరుతున్నారు. నాలుగు దిక్కులా ఉన్న రైల్వే గేట్ల కారణంగా కూడా నిత్యం రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని వికారాబాద్ వాసులు కోరుతున్నారు.

# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలి

## - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- లేఔట్ అనుమతికి అప్రోచ్ రోడ్డు తప్పనిసరి
- వాటర్ బాడీస్ ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్‌లలో ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దు
- లేఔట్ దరఖాస్తులపై సంయుక్త తనిఖీ నివేదికలను అక్టోబర్ 15లోగా సమర్పించాలి
- జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పెండింగ్‌లో ఉన్న లేఔట్ అనుమతులపై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, తదితర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలు, ఎన్‌ఓసీల స్థితిగతులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ లేఔట్ కమిటీ సమావేశం అనంతరం అనుమతులు మంజూరైనప్పటికీ కొంతమంది దరఖాస్తుదారులు ఆన్లైన్‌లో అనుమతులు మంజూరు కాలేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇకపై లేఔట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే సంబంధిత ఆన్లైన్ మంజూరు ప్రక్రియను మూడు రోజుల్లోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.లేఔట్ అనుమతులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలన, సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిపాదిత లేఔట్ భూమి చెరువులు, నీటి వనరులు, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఉందా లేదా క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖలు తమ పరిధిలోని అంశాలను పరిశీలించి అవసరమైన ఎన్‌ఓసీలు, నివేదికలను సకాలంలో అందించాలని ఆదేశించారు.లేఔట్ కు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లేఔట్‌లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.లేఔట్‌లో స్ట్రీట్ లైట్స్, సీవరేజ్ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు జారీ చేయరాదని స్పష్టం చేశారు.లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి





వనరులు, నీటి ప్రవాహ మార్గాలు ఉన్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని తెలిపారు.అనుమతులు మంజూరు చేసిన అనంతరం కూడా వాటిలో పేర్కొన్న నిబంధనలను లేఔట్ అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నివేదికలకు స్పష్టమైన కాలపరిమితి విధించి, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సంయుక్త పరిశీలన అవసరమైన లేఔట్లకు సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులను అక్టోబర్ 15వ తేదీలోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వేరో ఆత్మీయ సమ్మేళనం 66వ డివిజన్ ఇన్‌చార్జిగా పంగ అఖిల్ కుమార్



**నేటి శుభోదయ, హసన్‌పర్తి,సెప్టెంబర్ 30 :** హసన్‌పర్తి మండల కేంద్రంలోని 66వ డివిజన్‌లో స్వేరో ఆత్మీయ సమ్మేళనం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వర్ధన్నపేట నియోజకవర్గ స్వేరో ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జి చాతల్ల వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ కృషి చేస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించి గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనే స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, సభ్యులు సమన్వయంతో పనిచేయాలని వేణుగోపాల్ పిలుపునిచ్చారు. అనంతరం 66వ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా పంగ అఖిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు స్వేరో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాల బలోపేతానికి కృషి చేయాలని సమావేశంలో సూచించారు.

## కేయూ పరిరక్షణే లక్ష్యం.. 48 గంటల నిరసన దీక్ష

- **విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.. ఎస్‌ఎల్‌డీసీఈ ఎదుట ఏబీవీపీ ఆందోళన**




**నేటి శుభోదయ, హన్మకొండ, సెప్టెంబర్ 30 :** కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో 48 గంటల నిరసన దీక్షకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఎస్‌ఎల్‌డీసీఈ భవనం ఎదుట ప్రారంభమైన ఈ దీక్షలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పెంచిన కళాశాల ఫీజుల భారాన్ని తగ్గించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు తిరిగి చెల్లింపు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు.కేయూలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, స్వయం ఆర్థిక కోర్సులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యార్థినులకు సరిపడా వసతి గృహాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, గ్రంథాలయం, విద్యుత్ వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు.అలాగే యూనివర్సిటీ పరిధిలోని భూములు ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, వర్సిటీ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## బ్యాంకింగ్ సేవల్లో అప్రమత్తత అవసరం

- **కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఉదయశ్రీవెంకటాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు**




**నేటి శుభోదయ, పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 30 :** బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. ఉదయశ్రీ సూచించారు. బుధవారం మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలో బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 'రమేష్ టీం' బృందం బుర్రకథ ప్రదర్శన ద్వారా సైబర్ నేరాలు, ఆర్థిక అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా ఉదయశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రజల ఆశలు, భయాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. రుణ యాప్‌లు, లాటరీలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాల పేరుతో వచ్చే సందేశాలను నమ్మవద్దని సూచించారు. పాన్‌కార్డు నవీకరణ, ఆధార్ అనుసంధానం పేరుతో వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకులను తెరవకూడదని స్పష్టం చేశారు.ఒకసారి వినియోగించే సంకేత సంఖ్య, ఏటీఎం రహస్య సంఖ్య, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని కోరారు. అనధికార రుణ యాప్‌ల కోసం గూగుల్‌లో వెతకవద్దని సూచించారు. ఖాతాదారులు తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు బ్యాంకులో సమర్పించాలని తెలిపారు.రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పంట రుణాలతో పాటు పాడి పశువులు, గొర్రెల పెంపకం, ఆయిల్‌పామ్, పాలీహౌస్‌లు, ట్రాక్టర్లు, బంగారు రుణాలు, స్వయం సహాయక సంఘాలు, గృహ నిర్మాణం, వ్యాపారం, విదేశీ విద్య తదితర అవసరాలకు వివిధ రకాల రుణాలు అందిస్తున్నట్లు వివరించారు.సహకార బ్యాంకు డిపాజిట్లపై గరిష్ఠంగా 8 శాతం వరకు వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. రూ.436తో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, రూ.20తో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన సౌకర్యాలను పొందాలని సూచించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సర్పంచ్ తోట పోచయ్య, ఉపసర్పంచ్ కీర్తి సాయి, ఫీల్డ్ ఆఫీసర్ సందెబోయిన శ్రీనివాస్, ఎఫ్‌ఎల్‌సీ మోహన్‌రావు, బ్యాంకు సిబ్బంది మహేశ్వరి, సహకార సంఘం సిబ్బంది నారామల్ల విద్యాసాగర్, పైడాకుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిలిం ఫెడరేషన్‌పై భగ్గుమన్న పలు సినీ సంఘాలు

- **చిత్రపురి హౌసింగ్ సొసైటీలో భారీ అక్రమాల ఆరోపణలు**
- **సినీ యూనియన్లను విచ్ఛిన్నం చేస్తున్నారంటూ విమర్శలు**
- **వల్లభనేని అనిల్‌ను వదిలిపెట్టబోమంటూ తీవ్ర హెచ్చరిక**
- **విచారణ నివేదికలను బయటపెట్టాలని డిమాండ్**
- **వఫిలిం ఛాంబర్‌కు బాధితులు, కార్మిక సంఘాల ప్రతినిధుల వినతిపత్రం**
- **వల్లభనేని అనిల్‌ను జైలులో పెట్టాలి : పాశం యాదగిరి డిమాండ్**





**హైదరాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** తెలుగు సినీ పరిశ్రమకు వెన్నెముకగా భావించే 24 క్రాఫ్ట్స్ కార్మిక సంఘాల వ్యవస్థలో అంతర్గత పోరు రచ్చకెక్కింది. ఫిలిం ఫెడరేషన్‌లోని అధికార వ్యవహారశైలి, టాలీవుడ్ ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ (తెలుగు ఫిలిం వర్కర్స్ ఫెడరేషన్) అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్ అక్రమాలు, యూనియన్లలో జోక్యం, ఎన్నికల ప్రక్రియ, కార్మికుల హక్కులు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. ఒకవైపు ఫెడరేషన్‌పై నియంతృత్వ పోకడల ఆరోపణలు వినిపిస్తుండగా.. మరోవైపు చిత్రపురి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, సభ్యత్వాలు, ఇళ్ల కేటాయింపులు, విచారణ నివేదికలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సినీ కార్మిక సంఘాల ప్రతినిధులు తెలుగు ఫిలిం ఛాంబర్‌ను ఆశ్రయించడం పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.చిత్రపురి సాధన సమితి నాయకులు, 24 క్రాఫ్ట్స్–చిత్రపురి కాలనీ బాధితుల ప్రతినిధులు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిల్మ్ వింగ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రతినిధులు, తెలంగాణ సినిమా వేదిక సభ్యులు తదితరులు కలిసి తెలుగు ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అశోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్‌లో జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్న పరిణామాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, చిత్రపురి వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ తీవ్రంగా మండిపడ్డారు. ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్ అక్రమాలపై కేసులు పెట్టి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇలాంటి మోసగాళ్లను వదిలిపెట్టకూడదన్నారు.

### '24 క్రాఫ్ట్స్‌ను గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం'

డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ మద్దినేని రమేష్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రంగా మార్చాయి. 24 కార్మిక సంఘాలతో కూడిన ఫెడరేషన్‌లో ఒక వ్యక్తి ఆధిపత్యం పెరుగుతోందని ఆయన ఆరోపించారు. డ్యాన్సర్స్ యూనియన్, మహిళా వర్కర్స్ యూనియన్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్స్ యూనియన్ వంటి పలు సంఘాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, వాటిలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఫెడరేషన్ ఎన్నికలు, యూనియన్ ఎన్నికల సమయంలో డబ్బు, ఓట్ల వ్యవహారం జరుగుతోందని ఆయన ఆరోపించారు. తనకు అనుకూలంగా లేని వర్గాలను బలహీనపరిచి, అనుకూల వ్యక్తులను వివిధ సంఘాల్లోకి తీసుకురావడం ద్వారా మొత్తం ఫెడరేషన్‌ను ఆధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు.

### 'ఫెడరేషన్‌కు 26 వేల మంది కార్మికులు.. నిర్ణయాలు కొందరి చేతుల్లోనా?'

24 క్రాఫ్ట్స్‌లో సుమారు 26 వేల మంది కార్మికుల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు. ఇంత పెద్ద వ్యవస్థలో ప్రజాస్వామ్యబద్ధమైన విధానం, యూనియన్ల స్వతంత్రత, కార్మికుల హక్కులు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఫెడరేషన్ నాయకత్వం అన్ని యూనియన్లను సమన్వయం చేయాల్సి ఉండగా, విభేదాలు సృష్టించడం, ప్రత్యర్థి వర్గాలతో చేతులు కలపడం, బైలాస్‌కు విరుద్ధంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి.

### చిత్రపురిపై రూ.110 కోట్ల స్కామ్ ఆరోపణలు!

చిత్రపురి సాధన సమితి ప్రతినిధి కస్తూరి శ్రీనివాస్ చిత్రపురి హౌసింగ్ సొసైటీ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో జరిగిన విచారణ నివేదికల్లో సుమారు రూ.110 కోట్ల మేర ఆర్థిక అవకతవకలు జరిగినట్లు పేర్కొన్నారని ఆయన తెలిపారు. 2020–2025 కాలానికి సంబంధించి మరో విచారణ నివేదిక కూడా సిద్ధమైందని, అందులోని వివరాలను పూర్తిగా బహిర్గతం చేయలేదని ఆరోపించారు. విచారణ నివేదిక బయటకు వచ్చిన తర్వాత నిర్దిష్ట కాలవ్యవధిలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదని పేర్కొన్నారు. అయితే ఈ రూ.110 కోట్లకు సంబంధించిన ఆరోపణలు సంబంధిత విచారణ పత్రాలు, అధికారిక నివేదికల ఆధారంగా స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

### సభ్యత్వాలు.. ఓటర్ల జాబితాపైనా తీవ్ర ఆరోపణలు

చిత్రపురి హౌసింగ్ సొసైటీలో సభ్యత్వాలు, ఓటర్ల జాబితా, ఇళ్ల కేటాయింపులు, రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సుమారు 1,300 మంది నాన్–మెంబర్ల అంశాన్ని గత న్యాయపరమైన వ్యవహారాలతో ముడిపెట్టి కస్తూరి శ్రీనివాస్ ప్రశ్నించారు. అర్హత, సభ్యత్వం, కేటాయింపు ప్రక్రియపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, ఇళ్ల కేటాయింపులు జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

### డ్యాన్సర్స్ యూనియన్ వివాదం కూడా ముదిరింది

ఇదే సమయంలో డ్యాన్సర్స్ యూనియన్ వ్యవహారం కూడా వివాదానికి కేంద్రంగా మారింది. తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతా దేవి ఫిలిం ఫెడరేషన్ వైఖరిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి రాయపల్లి ప్రసాద్‌లు తమ యూనియన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. యూనియన్‌లో జరుగుతున్నాయని తాము ఆరోపిస్తున్న అవకతవకలను ప్రశ్నించినందుకే తమపై కక్షసాధింపు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన తనను ప్రశాంతంగా పనిచేయనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. జానీ మాస్టర్‌పై విధించిన నాన్–కోఆపరేషన్/సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేశారు.

### 'ఫెడరేషన్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి'

ఫెడరేషన్‌లో వ్యక్తిగత ఆధిపత్యం కాకుండా 24 క్రాఫ్ట్స్‌లోని అన్ని సంఘాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతినిధులు కోరారు. యూనియన్ల అంతర్గత సమస్యలను సంబంధిత సంఘాల పరిధిలోనే పరిష్కరించాలని, ఫెడరేషన్ స్థాయిలో పారదర్శక విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. ఫిలిం ఛాంబర్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సినిమాటోగ్రఫీ శాఖ, సహకార శాఖతో పాటు సంబంధిత అధికార సంస్థలు ఈ ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.

### 'విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయి'

చిత్రపురి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన భూములు, సభ్యత్వాలు, ఓటర్ల జాబితా, ఇళ్ల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు, నిధుల వినియోగం వంటి అంశాలపై సమగ్ర ఆడిట్, విచారణ అవసరమని ప్రతినిధులు పేర్కొన్నారు. తాము అధికారులకు, వివిధ ప్రభుత్వ సంస్థలకు ఇప్పటికే పలు ఫిర్యాదులు, వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. సంబంధిత పత్రాలు, విచారణ నివేదికలు, కోర్టు ఆదేశాలను పరిశీలించి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిత్రపురి సాధన సమితి ప్రతినిధి డా. కస్తూరి శ్రీనివాస్, డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ మద్దినేని రమేష్, తెలంగాణ ఉద్యమక◌ారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతా దేవి, పలు సినీ సంఘాల ప్రతినిధులు హేమ జిల్లోజు, కలగారా సుధీర్, భీమ్ రెడ్డి గుర్రం రాజు, ఉస్మానియా నగేష్, శివ శంకర్ పటేల్, తోట హరిత, తడివేలు తదితరులు పాల్గొన్నారు.

### ఇప్పుడు ఫిలిం ఛాంబర్ నిర్ణయంపైనే దృష్టి

24 క్రాఫ్ట్స్ ఫెడరేషన్ వ్యవహారం, డ్యాన్సర్స్ యూనియన్ వివాదం, చిత్రపురి హౌసింగ్ సొసైటీ ఆరోపణలు ఒకేసారి తెరపైకి రావడంతో తెలుగు సినీ పరిశ్రమలో ఈ అంశం చర్చన◌ీయాంశమవుతోంది. బాధితులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంపై తెలుగు ఫిలిం ఛాంబర్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# అంగన్వాడీ కేంద్రంలో పోషకాల ఆహార వారోత్సవాలు.

- ముఖ్య అతిథులుగా కోమల్ ,సూపర్వైజర్ పద్మజ







**మైలార్ దేవ్ పల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని శేరింగంపల్లి ప్రాజెక్టు మైలార్దేపల్లి సెక్టర్ మైలార్దేవపల్లి దాసరబస్తి సెంటర్లో బుధవారం ఉదయం ఈ కార్యక్రమం ఘనంగాజరుపుకున్నారు.ఆరోగ్యవంతమైన తరం కోసం పోషకాహారమేపునాది.మైలార్దేవ్పల్లి దాసర బస్తీ అంగన్వాడీ కేంద్రంలో పోషకాల వారోత్సవాలు.“ఆరోగ్యమేమహాభాగ్యం.ఆరోగ్యవంతమైన సమాజమే బలమైన భవిష్యత్తుకు పునాది” అనే సందేశంతో అన్న ప్రాసనకార్యక్రమంమైలార్దేవ్పల్లి (దాసర బస్తీ) అంగన్వాడీ కేంద్రంలో పోషకాలవారోత్సవాలను ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గర్భిణులు,బాలింతలు,చిన్నారులు తల్లిదండ్రులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం.చిన్న వయస్సులోనే పిల్లలకు సరైన పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని అంగన్వాడీ సిబ్బంది వివరించారు.కార్యక్రమానికి సూపర్వైజర్లు పద్మజ, కోమల్ ముఖ్య అతిథులుగా హాజరై పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు.చిన్నారుల ఎదుగుదలకు కేవలం ఆహారం తీసుకోవడం మాత్రమే కాకుండా సమతుల్యమైన, పోషకాలతో కూడిన ఆహారం అందించడం ఎంతో అవసరమని తెలిపారు.చిన్నారులకు పోషకాహారం తప్పనిసరిపిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మెదడు అభివృద్ధికి కూడా పోషకాహారం కీలకమని సిబ్బంది తెలిపారు.ఇంట్లో లభించే పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు,పాలు,గుడ్లు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పిల్లలకు వయస్సుకు అనుగుణంగా అందించాలని సూచించారు.చిన్నారులకు క్రమం తప్పకుండా ఆహారం ఇవ్వడంతో పాటు పరిశుభ్రమైన నీరు తాగించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అలవాట్లను చిన్నప్పటి నుంచే నేర్పించాలని సూచించారు.గర్భిణులు, బాలింతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.గర్భిణులు, బాలింతలు కూడా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్వైజర్లు సూచించారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పోషకాహారం తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు.బాలింతలు తమకు, తమ శిశువుకు అవసరమైన పోషకాలను అందించేలా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు తల్లి పాల ప్రాధాన్యతను వివరించడంతో పాటు, శిశువుల వయస్సు పెరుగుతున్న కొద్దీ వైద్య, అంగన్వాడీ సిబ్బంది సూచనల మేరకు తగిన అదనపు ఆహారాన్ని అందించాలని అవగాహన కల్పించారు.“నేటి పోషకాహారమే రేపటి ఆరోగ్యకరమైన తరానికి పెట్టుబడి”ఈ సందర్భంగా “ఈరోజు పిల్లలకు అందించే మంచి ఆహారమే రేపటి ఆరోగ్యకరమైన తరానికి పెట్టుబడి” అనే స్ఫూర్తిదాయక సందేశాన్ని తల్లిదండ్రులకు అందించారు.పిల్లలకు పోషకాహారం అందించడం కేవలం అంగన్వాడీ కేంద్రం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి తల్లి, తండ్రి ఇంటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు పునాది వేయాలని సూచించారు. చిన్నారులకు సరైన ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను అందిస్తే వారు ఆరోగ్యంగా ఎదిగి భవిష్యత్తులో సమాజానికి బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుమిత్ర, వకుళదేవి,అనిత,సబిత,రత్నసహాయకురాలు సునితతో పాటు గర్భిణులు, బాలింతలు,చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన సూచనలు అందించారు.పిల్లల ఆరోగ్యమే కుటుంబానికి ఆనందం.

# డాక్టర్ దశరథ్ ఎంఎస్‌కు అరుదైన గౌరవం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా నియామకం.. అభినందనల వెల్లువ





**సూర్యాపేట, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** కోదాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సీనియర్ సర్జన్, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ దశరథ్ ఎంఎస్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నియామకంపై జిల్లా వ్యాప్తంగా వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ దశరథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.వైద్య రంగంలో సీనియర్ సర్జన్‌గా విశేష అనుభవం ఉన్న డాక్టర్ దశరథ్.. ప్రభుత్వ వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. కోదాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్య సేవల అందించడంలో కీలకంగా పనిచేస్తున్నారు. కరోనా విపత్కర సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలు అందించారు.నిరుపేదలకు ఉచిత వైద్యం, రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో ఆయన సేవలు ప్రశంసలు అందుకున్నాయి. ఇదే సమయంలో కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త కొమరగిరికి కూడా రెడ్‌క్రాస్ డైరెక్టర్ పదవి లభించింది.ఈ సందర్భంగా డాక్టర్ దశరథ్ ఎంఎస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తానని పేర్కొన్నారు.

**కొమరగిరికి రెడ్‌క్రాస్ డైరెక్టర్‌గా బాధ్యతలు**

కోదాడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త కొమరగిరికి కూడా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా నియామకం లభించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయన సేవలను గుర్తించిన రెడ్‌క్రాస్ సొసైటీ ఈ బాధ్యతలను అప్పగించింది. నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాల్లో కొమరగిరి విశేషంగా సేవలందిస్తున్నారు. ఆయనకు డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

# శేరిలింగంపల్లి ప్రజల సమస్యల పరిష్కారం కోసం సి ఎం సి కమిషనర్ సృజన తో పి ఎ సి చైర్మన్ గాంధీ భేటీ..





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై మాదాపూర్ లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లో సి ఎం సి కమిషనర్ సృజన తో సమీక్షా సమావేశం జరిపిన పి ఎ సి చైర్మన్ అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిత్యం ట్రాఫిక్ రద్దీ తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, ట్రాఫిక్ కష్టాల నుండి గట్టెక్కించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ రహదారుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా అధికారులకు సూచనలు ఇవ్వాలని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని, లింక్ రోడ్ల ను ఏర్పాటు చేయాలని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియ చేశారు.చందానగర్ ప్రధాన రహదారి, హైదర్ నగర్, మియాపూర్ బొల్లారం రోడ్డు లో, వివేకానంద నగర్ బాగ్అమీర్ కాలనీ జాతీయ రహదారి నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు అని, ప్రమాదాలు జరుగునని, పాదచారులకు రోడ్డు దాటడం కష్టంగా ఉండునని, ప్రజలు రోడ్డు దాటే సమయంలో చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, ప్రమాదాల బారిన పడుతున్నారు అని, పరిసర ప్రాంత ప్రజలకు ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి లు ఎంతగానో ఉపయోగపడుతాయి అని, పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటడానికి అన్ని హంగులతో సకల సౌకర్యాలతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేల చర్యలు తీసుకోవాలని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేశారు.ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వలన వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రజలకు రక్షణ కల్పిస్తుంది అని, వేగంగా వెళ్ళే వాహనాల మధ్య రోడ్డు దాటే ప్రమాదాలను తగ్గిస్తుంది అని, జనాల రాకపోకల వల్ల రోడ్లపై ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లను తగ్గిస్తుంది.అని , వృద్ధులు, దివ్యాంగుల కోసం మెట్లతో పాటు లిఫ్ట్‌లు లేదా రాంప్‌లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది అని గాంధీ తెలియచేశారు.మసీదు బండ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విస్తరణలో స్థలాలు, భవనాలు కోల్పోతున్నవారికి సముచిత న్యాయం చేయాలని,వారి జీవనాధారం కోల్పోవడం జరుగుతుంది కావున అందరికీ సమ న్యాయం చేయాలని, టి డి ఆర్ ప్రక్రియ ను వేగవంతం చేయాలని, అదేవిధంగా అంజయ్య నగర్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, తారా నగర్ రోడ్డు విస్తరణ పనులు వేగం పెంచాలని , ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కెల చూడాలని,రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలని, అధికారులకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వాలని, టౌన్ ప్లానింగ్, సి ఎం సి ఇంజనీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో పనిచేసేలా చూడాలని కమిషనర్ గారిని కోరడం జరిగినది అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేశారు.గంగారం చెరువు నుండి జాతీయ రహదారి (ఎన్ హెచ్-65) అపర్ణ హిల్ పార్క్ వరకు లింక్ రోడ్డు టెండర్ పూర్తి అయినది అని, సంబంధిత పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కమిషనర్ ని కోరడం జరిగినది. ఈ లింక్ రోడ్డు వలన ప్రజలకు ఎంతో సాంత్వన చేకూరునని, ట్రాఫిక్ సమయం తగ్గి, ఇంధనం ఆదా అవునని చైర్మన్ గాంధీ తెలియచేశారు.అదేవిధంగా శేరిలింగంపల్లినియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాలని, పార్కులను అభివృద్ధి చేయాలని, వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని అధికారులు అందరూ సన్నద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని , అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా, సమన్వయం తో పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కమిషనర్ గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీమతి సృజన మాట్లాడుతూ పైన పేర్కొన్న అంశాల పై సానుకూలంగా స్పందించడం జరిగినది.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సి సి పి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వేసిన మట్టిని తొలిగించే వరకు పోరాటం చేస్తాం..

- ఒక్క చెరువు మట్టి అని చెప్పి వందల ట్రిప్పులతో మట్టి డంపింగ్ ప్రాణ భయంతో స్థానికులు..
- అక్రమంగా మట్టి వేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలీ..
- పోలుసులమనే బెదిరింపు చర్యలు మానుకోవాలి తాజా మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి





**గచ్చిబౌలి , సెప్టెంబర్ 30, నేటి శుభోదయ :** అక్రమంగా చెరువు మట్టి నీ తెచ్చి ఇళ్ళకు నష్టం వాటిల్లేలా డంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. నల్లగండ్ల, నానక్ రామ్ గూడా, కోకాపేట తదితర ప్రాంతాల్లోనీ చెరువు పూడికతీత మట్టిని వందల ట్రిప్పులు తెచ్చి గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గోపన్ పల్లి గ్రామం తండ, వీకర్ సెక్షన్ పక్కనున్న ఇళ్ల మధ్య ఉన్న కాలి ప్రదేశంలో వందల ట్రిప్పుల ద్వారా మట్టిని తెచ్చి నింపడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. గత మూడు, నాలుగు నెలల నుండి ఇలాగే జరుగుతుందని, ఈ విషయం అధికారులకు తెలిపినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో మంగళవారం రోజు స్థానికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపన్ గ్రామం వికర్ సెక్షన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నల్లగండ్ల చెరువు సుందరీకరణలో భాగంగా పూడిక తీత మట్టిని తెస్తున్నారని హైడ్రా అధికారులు చెప్పినప్పటికీ ఒక్క నల్లగండ్ల నుండే కాకుండా కోకాపేట, నానక్ రామ్ గూడా తదితర ప్రాంతాల నుండి అక్రమంగా మట్టినీ తెచ్చి ఇక్కడ డంపింగ్ చేయడం సరికాదన్నారు. ఇక్కడ వర్షం నీరు వచ్చే నాలాను పూడ్చివేశారని, కాపాడాల్సిన అధికారులే ఇలా చేయడం కరెక్ట్ కాదన్నారు. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు కాపాడే హైడ్రా అధికారులే ఇలా చేస్తున్నారని, ప్రశ్నించిన స్థానికులను పోలీసులమని బెదిరించి, అడ్డుకున్న సామాన్య ప్రజలపై పోలీస్ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మార్వోను అడగగా తాత్కాలికంగా మట్టి వేసుకోమని చెప్పినట్లు అధికారులు చెప్తున్నారని, తీసుకుని ఇది నిజామా కాదా అని తెలపాలన్నారు. దీని వల్ల పేద ప్రజల ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, వర్షం వస్తె ఆ మట్టి కుప్పలు ఇండ్ల మీద పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెల్లామని అధికారులకు పిర్యాదు చేశామని తెలిపారు. వెంటనే ఈ మట్టుకుప్పలను తొలగించాలని, అప్పటి వరకు తమ ప్రజల తో కలసి తరపున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. మట్టి డంపింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. వరదలు వచ్చినప్పుడు కాపాడాల్సిన హైడ్రా అధికారులే ఇలా చేయడం సరికాదని, రేపు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి పరిస్థిని వివరిస్తామని తెలిపారు.ఇప్పటికే వేసిన మట్టిని తొలగించాలని కోరుత సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానికం గా నివాసం ఉంటున్న మహిళలు రేష్మ, ప్రమీల లు 20 ఫీట్లు ఎత్తున మట్టి డంపింగ్ వల్ల ఏర్పడిన సమస్యలను, వారి ఇబ్బందుల ను అధికారులకి, నాయకులకు ఏకరువు పెట్టారు. అక్కడే ఉన్న ఆర్ ఐ ఇంద్ర సేనా రెడ్డికి వినతి పత్రం ను అందజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు శ్రీ రాములు, శేఖర్, ఈ. రవి , నరేశ్ , ప్రకాష్ , సుమన్, శ్రీ శైలం, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్, రాజు ముదిరాజ్ , రాజు తదితరులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620